




# మన దునియా

మన అక్షరం - మన ప్రపంచం

RNI Number
TELTEL/2023/85680









సంపుటి : 3 | సంచిక : 241 | మార్చ్ 18 బుధవారం 2026 | పేజీలు : 8 | వెల రూ. 4.00/-


# ఈగల్ ముసుగులో పోలీస్ డాగ్‌లు..!?



**పరవాడ పోలీస్ స్టేషన్‌పై సంచలన ఆరోపణలు మండిపడుతున్న ప్రజలు ఫిర్యాదుదారులు!?**


**డిపార్ట్మెంట్లో కింద స్థాయి నుంచి పై స్థాయి వరకు అందరూ గజ ఈగల్ దొంగలే...!?**

**మా చేతిలో లాండ్ ఆర్డర్ ఉంది సవాల్ విసురుతున్న ఈగల్ డాగ్ లు !?**

**మమ్మల్ని అడిగే వారెవరు పట్టుకునే వారెవరు ఖబడ్దార్ అంటున్న ఈగల్ దాగులు టీం!?**

**విశాఖ ఉమ్మడి జిల్లా మన దునియా:మార్చి 17**

అనకాపల్లి జిల్లా పరవాడ గ్రామంలో ఉన్న పోలీస్ స్టేషన్ పని తీరు ప్రస్తుతం తీవ్ర విమర్శలకు గురవుతోంది. ప్రజల రక్షణ కోసం ఉండాల్సిన పోలీస్ వ్యవస్థ, కొంతమంది అధికారుల ప్రవర్తన వల్ల "ఈగల్ ముసుగులో పోలీస్ డాగ్‌లా మారిపోయింది" అంటూ గ్రామస్థులు ఫిర్యాదారులు మండిపడుతున్నారు. చట్టాన్ని కాపాడాల్సిన బాధ్యత ఉన్న పోలీస్ అధికారులు, అదే చట్టాన్ని ఆయుధంగా మార్చుకుని నిరపరాధులను వేధిస్తున్నారనే ఆరోపణలు వెలువడుతున్నాయి. చట్టానికి గంతులు కట్టేసిన ఈగలు డాగ్ లు. చిన్న చిన్న గ్రామీణ వివాదాలను సైతం పెద్ద సమస్యలుగా మలుస్తూ, కొందరిని లక్ష్యంగా చేసుకుని కేసులు నమోదు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. బలమైన వాడైతే మా వాడే వదిలేయండి! పేదోడి స్థానం కంటతడి కటకటాలు ఇంకా మాటల్లో చెప్పాలంటే "పోలీస్ స్టేషన్‌కి ఫిర్యాదు చేయడానికి వెళ్లినప్పుడు న్యాయం దొరకడం లేదు. బదులుగా ఒత్తిళ్లు, బెదిరింపులు మాత్రమే ఎదురవుతున్నాయి" అని బాధితులు



## రైతు భరోసా: రేవంత్‌కు సవాల్‌గా మారిన పెట్టుబడి సాయం!

**మన దునియా,హైదరాబాద్: మార్చి 17**

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న రైతు భరోసా పథకం అమలు ఇప్పుడు ఆర్థికంగా , రాజకీయంగా పెద్ద సవాల్‌గా మారింది. మార్చి 22వ తేదీన సిద్దిపేట జిల్లా నర్మెట్ట వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మొదటి విడత నిధులను విడుదల చేసేందుకు సిద్ధమయ్యారు. అయితే, గతంలో ఇచ్చిన హామీ ప్రకారం ఎకరానికి రూ. 15,000 ఇస్తామన్న మాటను అమలు చేయడంలో ఎదురవుతున్న ఆర్థిక ఇబ్బందులు, విపక్షాల విమర్శలు ప్రభుత్వాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి.

మూడు విడతల వ్యూహం.. ఆర్థిక భారమే కారణమా?

ప్రస్తుత యాసంగి సీజన్‌కు సంబంధించి సుమారు రూ. 9,000 కోట్లను రైతులకు పంపిణీ చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అయితే, ఈ నిధులను ఒకేసారి కాకుండా మూడు విడతల్లో విడుదల చేయాలని నిర్ణయించడం వెనుక రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ప్రధాన కారణమని విశ్లేషకులు భావిస్తున్నారు. మొదటి విడతగా మార్చి 22న రూ. 3,590 కోట్లను సుమారు 70



## కేటీఆర్‌వి సత్యదూరమైన మాటలు: మంత్రి సీతక్క

**మన దునియా,హైదరాబాద్: మార్చి 17**

కేటీఆర్‌వి సత్యదూరమైన మాటలు: మంత్రి సీతక్క

తెలంగాణ : మహిళా సంక్షేమంపై ప్రతిపక్ష నేత కేటీఆర్ సత్యదూరమైన ఆరోపణలు



## అమెరికాతో రాజీకి నో.. ప్రతీకారానికే మొగ్గు: ఇరాన్ కొత్త సుప్రీం లీడర్

అమెరికాతో ఉద్రిక్తతలు తగ్గించుకోవాలంటూ మధ్యవర్తి దేశాల ద్వారా వచ్చిన సంధి ప్రతిపాదనలను ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ అయతుల్లా మొజ్తబా ఖమేనీ నిర్ద్వంద్వంగా తిరస్కరించారు. అమెరికా, ఇజ్రాయెల్‌పై ప్రతీకారం తీర్చుకునే విషయంలో ఆయన చాలా దృఢవైఖరితో ఉన్నారని



## ప్రజాపోరాటాలు విజయం సాధిస్తాయని దీని ద్వారా నిరూపితమైంది: కవిత

ప్రజాపోరాటాలు విజయం సాధిస్తాయని ఖమ్మం జిల్లా వెలుగుమట్ల ఘటన ద్వారా నిరూపితమైందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. ఈ మేరకు ఆమె 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేశారు. వెలుగుమట్లలో 750 మంది పేదల ఇళ్లను కూలగొట్టిన అరాచక కాంగ్రెస్ ప్రభుత్వంపై తెలంగాణ జాగృతి, ధర్మ సమాజ్ పార్టీ అధ్యక్షులు విశారధన్ మహారాజ్ ఆధ్వర్యంలో చేపట్టిన సంయుక్త పోరాటాలఫలితంగా ప్రభుత్వం దిగివచ్చిందని పేర్కొన్నారు. ఇళ్లు కోల్పోయిన వారిలో 411 మందికి పట్టాలు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించిందని గుర్తు చేశారు. ప్రజా పోరాటాలు తప్పక



మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం

# కేటీఆర్‌వి సత్యదూరమైన మాటలు: మంత్రి సీతక్క

(మొదటి పేజీ తరువాయి)

చేస్తున్నారని మంత్రి సీతక్క మండిపడ్డారు. మంగళవారం అసెంబ్లీలో ఆమె మాట్లాడుతూ.. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో తమ ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. బాధ్యత గల ప్రతిపక్షంగా దీనికి సహకరించాలని ఆమె కోరారు. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా మహిళా సంఘాలకు రూ. 57 వేల కోట్లకు పైగా రుణాలను మంజూరు చేశామని గణాంకాలతో వివరించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రతి పథకాన్ని ప్రతిపక్షాలు ఎగతాళి చేయడం సరికాదన్నారు.

# అమెరికాతో రాజీకి నో.. ప్రతీకారానికే మొగ్గు: ఇరాన్ కొత్త సుప్రీం లీడర్

(మొదటి పేజీ తరువాయి)

ఓ ఇరాన్ సీనియర్ అధికారి 'రాయిటర్స్'కు వెల్లడించారు. తన నియామకం తర్వాత జరిగిన తొలి విదేశాంగ విధాన సమావేశంలో మొజ్తబా ఈ మేరకు స్పష్టమైన సంకేతాలిచ్చారు."రక్త ప్రతీకారాన్ని మేం మరిచిపోం. పూర్తి శక్తితో ప్రతిఘటిస్తాం. శత్రువుల నుంచి పరిహారం పొందుతాం లేదా అదే స్థాయిలో వారి ఆస్తులను ధ్వంసం చేస్తాం" అని మొజ్తబా ఖమేనీ హెచ్చరించినట్లు ఆ అధికారి తెలిపారు. ప్రతీకార చర్యలు ఇప్పటికే మొదలయ్యాయని, అవి పూర్తయ్యే వరకు తమ ప్రాధాన్యత అదేనని ఆయన స్పష్టం చేశారు.ఫిబ్రవరి 28న అమెరికా-ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడిలో మొజ్తబా తండ్రి, అప్పటి సుప్రీం లీడర్ అలీ ఖమేనీ మరణించిన విషయం తెలిసిందే. ఈ దాడిలో మొజ్తబా కూడా తీవ్రంగా గాయపడ్డారు. కువైట్ వార్తాపత్రిక అల్-జరీదా కథనం ప్రకారం, రష్యా అధ్యక్షుడు పుతిన్ చొరవతో మొజ్తబాను మెరుగైన చికిత్స కోసం మాస్కోకు తరలించారు. అయితే, ఈ వార్తలపై తాము స్పందించబోమని రష్యా తెలిపింది. ఇదిలా ఉండగా, తాజా దాడిలో ఇరాన్ సీనియర్ భద్రతా అధికారి అలీ లారిజానీ, రెవల్యూషనరీ గార్డ్ బాసిజ్ ఫోర్స్ చీఫ్ జనరల్ ఘోలం రెజా సొలైమానీని చంపినట్లు ఇజ్రాయెల్ ప్రకటించింది. అయితే, ఈ మరణాలను ఇరాన్ అధికారికంగా ధృవీకరించలేదు.

# ప్రజాపోరాటాలు విజయం సాధిస్తాయని దీని ద్వారా నిరూపితమైంది: కవిత

(మొదటి పేజీ తరువాయి)

విజయం సాధిస్తాయనే విషయం స్పష్టమైందని పేర్కొన్నారు. 750 మంది ఇళ్లు కూల్చివేసి కేవలం 411 మందికి మాత్రమే పట్టాలు ఇవ్వడంతో మిగతా బాధితుల్లో తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. మిగిలిన వారిలో తమకు అన్యాయం జరిగిందనే భావన నెలకొందని అన్నారు. పట్టాల పంపిణీలో పారదర్శకత ఉండాలని, ప్రతి బాధితుడికి న్యాయం జరగాలనే లక్ష్యంగా వెలుగుమట్ల బాధితుల కోసం తాము నిజ నిర్ధారణ కమిటీని ఏర్పాటు చేశామని అన్నారు. రిటైర్డ్ న్యాయమూర్తి నేతృత్వంలోని నిజ నిర్ధారణ కమిటీలో ఆర్మీ మాజీ అధికారి, ప్రొఫెసర్లు, న్యాయవాదులు, సామాజిక కార్యకర్తలు, జర్నలిస్టులు భాగస్వాములు అయ్యారని తెలిపారు. బాధితులకు న్యాయం జరిగే వరకు ఈ కమిటీ ప్రభుత్వాన్ని నిలదీస్తుందని కవిత అన్నారు. ఈ నిజనిర్ధారణ కమిటీకి ప్రభుత్వం, అధికారులు పూర్తిగా సహకరించాలని ఆమె డిమాండ్ చేశారు.

# భవానీపూర్ బరిలో మమత... మరోసారి దీదీ - సువేందు అధికారి పోరు

పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రాజకీయాలు వేడెక్కాయి. ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తన సొంత నియోజకవర్గమైన భవానీపూర్ నుంచి పోటీ చేయనున్నట్లు ప్రకటించారు. దీంతో, బీజేపీ నేత, ప్రతిపక్ష నాయకుడు సువేందు అధికారికి, మమతకు మధ్య మరోసారి హోరాహోరీ పోరుకు రంగం సిద్ధమైంది. ఈ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా సువేందు అధికారి పేరును కాషాయదళం అధినాయకత్వం ఇప్పటికే ప్రకటించింది. ఇప్పుడు మమతా కూడా ఇదే స్థానం నుంచి బరిలో దిగుతుండడంతో అందరి దృష్టి భవానీపూర్ నియోజకవర్గంపైనే ఉండనుంది.గత 2021 ఎన్నికల్లో మమతా బెనర్జీ నందిగ్రామ్ నుంచి పోటీ చేయగా, సువేందు అధికారి ఆమెపై సుమారు 2,000 ఓట్ల తేడాతో విజయం సాధించారు. ఆ తర్వాత ముఖ్యమంత్రిగా కొనసాగేందుకు మమత... భవానీపూర్ నుంచి ఉపఎన్నికలో గెలిచి అసెంబ్లీలో అడుగుపెట్టారు. ఇప్పుడు సువేందు అధికారి నేరుగా భవానీపూర్‌లోనే ఆమెతో తలపడనుండటం రాజకీయంగా ఆసక్తిని రేపుతోంది.రాబోయే ఎన్నికల కోసం తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) 291 మంది అభ్యర్థులతో కూడిన జాబితాను మమత విడుదల చేశారు. మొత్తం 294 స్థానాలున్న బెంగాల్ అసెంబ్లీలో, డార్జిలింగ్ పరిధిలోని 3 స్థానాలను మిత్రపక్షమైన బీజీపీఎంకు కేటాయించారు. ఈ సందర్భంగా మమతా బెనర్జీ మాట్లాడుతూ, ఈ ఎన్నికల్లో తమ పార్టీ 226 కంటే ఎక్కువ స్థానాలు గెలుచుకోవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల సంఘం బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తోందని, రాష్ట్రంలోని కీలక అధికారులను బదిలీ చేయడం దీనికి నిదర్శనమని ఆరోపించారు. బీజేపీ రాష్ట్రంలో ఘర్షణలు సృష్టించేందుకు కుట్ర చేస్తోందని, ఏమైనా అవాంఛనీయ ఘటనలు జరిగితే ఎన్నికల సంఘానిదే బాధ్యత అని హెచ్చరించారు. టీఎంసీ అభ్యర్థుల జాబితా విడుదలతో బెంగాల్ ఎన్నికల రాజకీయం మరింత రసవత్తరంగా మారింది.




# రైతు భరోసా: రేవంత్‌కు సవాల్‌గా మారిన పెట్టుబడి సాయం!

(మొదటి పేజీ తరువాయి)

ల మంది రైతుల ఖాతాల్లో జమ చేయనున్నారు. ఆ తర్వాత 20 రోజులకు రెండో విడత రూ. 2,650 కోట్లు , ఏప్రిల్ నెలాఖరుకు మూడో విడత నిధులు విడుదల కానున్నాయి. ఈ విడతల వారీ పంపిణీ నిధుల సర్దుబాటులో ఉన్న ఇబ్బందులను స్పష్టం చేస్తోంది.

హామీల అమలుపై ప్రశ్నలు

రైతు భరోసా నిధుల విడుదలలో జరుగుతున్న ఆలస్యంపై బీఆర్ఎస్, బీజేపీలు గట్టిగా నిలదీస్తున్నాయి. ముఖ్యంగా రాహుల్ బంధు పేరుతో నిధులను పక్కదారి పట్టిస్తున్నారని కేటీఆర్ ఆరోపించగా, ఎన్నికల హామీ ప్రకారం పెంచిన నగదును ఎందుకు ఇవ్వడం లేదని బీజేపీ ప్రశ్నిస్తోంది. మున్సిపల్ ఎన్నికల కోడ్ , ఇతర సాంకేతిక కారణాల వల్ల నిధుల విడుదల ఆలస్యమైనప్పటికీ, విత్తనాలు , ఎరువుల కొనుగోలు సమయంలో ఈ సాయం అందకపోవడం రైతాంగంలో కొంత అసంతృప్తికి దారితీసింది. ఈ విమర్శలను తిప్పికొట్టడమే ఇప్పుడు రేవంత్ రెడ్డి సర్కార్ ముందున్న తక్షణ కర్తవ్యం. సిద్దిపేట వంటి కీలక జిల్లా నుంచి ఈ నిధుల విడుదలను ప్రారంభించడం వెనుక రాజకీయ వ్యూహం కూడా ఉంది. హరీష్ రావు వంటి బలమైన నేతలున్న జిల్లాలో రైతు భరోసాను ఘనంగా ప్రారంభించడం ద్వారా క్షేత్రస్థాయిలో రైతుల మద్దతును కూడగట్టాలని కాంగ్రెస్ భావిస్తోంది. అదే సమయంలో, అర్హులైన రైతుల ఎంపికలోనూ ప్రభుత్వం ఆచితూచి వ్యవహరిస్తోంది. గతంలో సాగులో లేని భూములకు కూడా నిధులు వెళ్లాయన్న విమర్శల నేపథ్యంలో, ఈసారి నిబంధనలను కఠినతరం చేయడం వల్ల మరిన్ని రాజకీయ వివాదాలు తలెత్తే అవకాశం ఉంది. రూ. 9,000 కోట్ల నిధులను సక్రమంగా పంపిణీ చేసి, రైతుల నమ్మకాన్ని నిలబెట్టుకోవడం రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి అగ్నిపరీక్ష లాంటిదే. ఏప్రిల్ నెలాఖరు కల్లా పూర్తి నిధులు జమ కాకపోతే రేవంత్ పై నమ్మకం తగ్గిపోయే అవకాశాలుంటాయి.

# ఈగల్ ముసుగులో పోలీస్ డాగ్‌లు..!?

(మొదటి పేజీ తరువాయి)


ఇంకా పోతున్నారు. కొంతమంది అధికారులు తమ అధికారాన్ని ప్రదర్శించడానికే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పరవాడ గ్రామ ప్రజలు పోలీస్ స్టేషన్‌కి వెళ్లాలా? లేక దూరంగా ఉండాలా? అనే పరిస్థితి ఏర్పడింది. ప్రజల సమస్యలు పరిష్కరించాల్సిన పోలీస్ వ్యవస్థపై ఇలాంటి ఆరోపణలు రావడం ఆందోళన కలిగించే అంశంగా మారింది.పోలీస్ శాఖఉన్నతాధికారులు ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకుని వెంటనే విచారణ చేపట్టాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. అధికార దుర్వినియోగానికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటేనే పోలీస్ వ్యవస్థపై ప్రజలకు మళ్లీ నమ్మకం వస్తుందని వారు స్పష్టం చేస్తున్నారు.ప్రజల రక్షణ కోసం ఉన్న పోలీస్ వ్యవస్థ ప్రజలకే భయం కలిగించేలా మారితే, అది సమాజానికి ఎంత ప్రమాదకరమో పరవాడ ఘటన స్పష్టంగా చూపిస్తోంది.

# మూడేళ్లలో పేదల సొమ్ము రూ. 19 వేల కోట్లను బ్యాంకులు దోచుకున్నాయి: ఎంపీ రాఘవ్ చద్దా



పార్లమెంట్ వేదికగా ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపీ రాఘవ్ చద్దా 'మినిమం బ్యాలెన్స్' పెనాల్టీల అంశంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బ్యాంకింగ్ వ్యవస్థలో జరుగుతున్న ఈ నిశ్శబ్ద దోపిడీపై ఆయన అందించిన గణాంకాలు విస్తుగొలుపుతున్నాయి. బ్యాంకు ఖాతాల్లో కనీస నిల్వ (మినిమం బ్యాలెన్స్) లేదనే నెపంతో గత మూడేళ్లలో బ్యాంకులు ఏకంగా రూ.19 వేల కోట్లు వసూలు చేశాయని రాఘవ్ చద్దా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ భారీ మొత్తం అపర కోటీశ్వరుల జేబుల నుంచి వచ్చింది కాదని, రెక్కాడితే గానీ డొక్కాడని రోజువారీ కూలీలు, రైతులు, తమ మందుల ఖర్చుల కోసం పైసా పైసా పోగేసుకునే పెన్షనర్ల కష్టార్జితమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేట్ బ్యాంకులు రూ.11 వేల కోట్లు, ప్రభుత్వ రంగ బ్యాంకులు రూ.8 వేల కోట్లు ఈ రూపంలో వసూలు చేశాయని దుయ్యబట్టారు. ఈ జరిమానాలను 'పేదరికంపై వేసిన పన్ను'గా ఆయన అభివర్ణించారు. ఒక సామాన్యుడు తన అత్యవసర ఖర్చుల కోసం అకౌంట్ ఖాళీ చేసినప్పుడు, అతనికి అండగా ఉండాల్సిన బ్యాంకులు రివర్స్‌లో వందల రూపాయల పెనాల్టీలు వేయడం ఎంతవరకు న్యాయమని ప్రశ్ని ంచారు. జన్ ధన్ ఖాతాలకు మినహాయింపు ఉన్నప్పటికీ, కోట్లాది మంది సామాన్య సేవింగ్స్ ఖాతాదారులపై ఈ భారం పడుతోందని ధ్వజమెత్తారు. ఈ పెనాల్టీలను తక్షణమే రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వం, ఆర్బీఐని ఆయన డిమాండ్ చేశారు.

# ఏపీకి భారీ ఊరట... అదనంగా 24 వేల మెట్రిక్ టన్నుల ఎల్పీజీ వచ్చింది: సీఎం చంద్రబాబు



ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఊరటనిచ్చే వార్త చెప్పారు. రాష్ట్రానికి అదనంగా 24 వేల మెట్రిక్ టన్నుల ఎల్పీజీ అందుబాటులోకి వచ్చిందని, గ్యాస్ నిల్వలపై ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి రాష్ట్రంలో ఎల్పీజీ నిల్వలు, సరఫరా, పైప్డ్ గ్యాస్ నెట్వర్క్ వంటి కీలక అంశాలపై ఆయన ఉన్నతాధికారులు, పెట్రోలియం కంపెనీల ప్రతినిధులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు.రాష్ట్రంలో ప్రస్తుతం 15 రోజులకు సరిపడా 14 వేల మెట్రిక్ టన్నుల ఎల్పీజీ నిల్వలు ఉండగా, తాజాగా విశాఖలో అదనపు స్టాక్ చేరడంతో సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు లేవని సీఎం భరోసా ఇచ్చారు. ఈకేవైసీ, ఓటీపీల సాయంతో గ్యాస్ సిలిండర్లను బ్లాక్ మార్కెట్‌కు తరలించకుం డా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశిం చారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా పంపిణీ జరిగేలా చూడాలన్నారు. గ్యాస్ సిలిండర్ల డెలివరీ సమయాన్ని ప్రస్తుతం ఉన్న దానికంటే తగ్గించి, కేవలం 1.5 రోజుల్లో వినియోగదారులకు అందేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఆస్పత్రులు, హాస్టళ్లు, దేవాలయాలకు గ్యాస్ కొరత రాకుండా చూడాలని, ప్రత్యామ్నాయంగా ఇండక్షన్ స్టవ్‌ల లభ్యతను కూడా పరిశీలించాలని సూచించారు.

పైప్డ్ గ్యాస్ నెట్వర్క్ విస్తరణే లక్ష్యం

ఎల్పీజీ సరఫరాను పర్యవేక్షిస్తూనే, దీనికి శాశ్వత ప్రత్యామ్నాయంపై ముఖ్యమంత్రి దృష్టి సారించారు. రాష్ట్రంలో సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ (సీజీడీ) నెట్వర్క్‌ను మరింతగా విస్తరించడం ద్వారా ప్రజలపై భారం తగ్గించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఏపీలో ఉత్పత్తి అవుతున్న సహజ వాయువును పైప్డ్ నెట్వర్క్ ద్వారా ప్రజల ఇళ్లకు చేర్చడంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని సూచించారు. కంప్రెస్డ్ నేచురల్ గ్యాస్ (సీఎన్ జీ), పైప్డ్ నేచురల్ గ్యాస్ (పీఎన్ జీ) వినియోగాన్ని గరిష్ఠంగా పెంచేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని పేర్కొన్నారు. గతంలో ఎల్ఎన్జీని ఏపీకి కేటాయించుకుని, రెండు సీజన్లలో పైప్ లైన్ ద్వారా కొండపల్లి వరకు తీసుకురాగలిగామని సీఎం గుర్తు చేశారు. తక్కువ వ్యయంతో కూడిన ఇంధనాన్ని వి ని యో గ దా ర ు ల క ు అందించడమే లక్ష్యమని స్పష్టం చేశారు.ప్రస్తుతం రాష్ట్రంలో ఏజీ అండ్ పీ, భాగ్యనగర్ గ్యాస్ లిమిటెడ్, జీజీపీఎల్, ఐఓసీఎల్, మెఘా గ్యాస్ వంటి సంస్థలు 198 సీఎన్జీ స్టేషన్ల ద్వారా గ్యాస్ సరఫరా చేస్తున్నాయని, 1.68 లక్షల గృహాలకు కనెక్షన్లు ఇచ్చే మౌలిక సదుపాయాలు ఉన్నాయని అధికారులు సీఎంకు వివరించారు.

'ఏపీ వన్' యాప్‌తో సత్వర సేవలు

ఈ సమీక్షలో కేవలం ఇంధన అంశాలకే పరిమితం కాకుండా, పలు పాలనాపరమైన అంశాలపైనా సీఎం ఆదేశాలు జారీ చేశారు. ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై వాహనదారులకు అవగాహన కల్పించాలని, వారికి సంక్షిప్త సందేశాలు పంపాలని సూచించారు. విద్యుత్ బిల్లుల చెల్లింపుల కోసం రూపొందిస్తున్న 'ఏపీ వన్ యాప్'ను త్వరితగతిన అందుబాటులోకి తేవాలన్నారు. ప్రభుత్వ శాఖలు 'డేటా లేక్', 'అవేర్' వేదికలను ఏ మేరకు వినియోగించుకుంటున్నాయో గుర్తించి, వేసవిలో తాగునీరు, వడగాల్పులు, పశుగ్రాసం వంటి అంశాలపై ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. మహిళలపై నేరాలు, డ్రగ్స్ నియంత్రణపై అత్యంత కఠినంగా వ్యవహరించాలని, స్వర్ణాంధ్ర లక్ష్యాల సాధనకు ప్రజల్లో అవగాహన కల్పించాలని ఆదేశించారు.ఈ ఉన్నతస్థాయి సమీక్షలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, ఐఅండ్ఐ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు, ఇతర ఉన్నతాధికారులు, గెయిల్, ఓఎన్జీసీ, వివిధ పెట్రోలియం కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం



# తోగ్గూడెం అక్రమ మైనింగ్ వ్యవహారంపై విచారణ జరపాలి

## బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి పానిశెట్టి వెంకటేశ్వర్లు




**మన దునియా,భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ,తోగ్గూడెం:మార్చి 17**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలంలోని తోగ్గూడెం గ్రామంలో జరిగిన అక్రమ మైనింగ్ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని భారతీయ జనతా పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పానిశెట్టి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఈ రోజు పాల్వంచ ప్రెస్ క్లబ్‌లో బీజేపీ నాయకులతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాల్వంచ మండలంలోని తోగ్గూడెం గ్రామంలో అనేక సంవత్సరాలుగా సుమారు 10 క్వారీలు మరియు 7 నుండి 8 క్రషింగ్ మిల్లులు నడుస్తున్నాయని తెలిపారు. ఈ క్వారీలు అమాయక గిరిజనులను అడ్డం పెట్టుకొని ప్రభుత్వం నుండి అనుమతులు పొంది కొందరు దళారులు వందల కోట్ల రూపాయల అక్రమ మైనింగ్ చేస్తున్నారని ఆరోపించారు. ఈ అక్రమ మైనింగ్ అంశంపై భారతీయ జనతా పార్టీ గత నాలుగు సంవత్సరాలుగా జిల్లా స్థాయి నుండి రాష్ట్ర స్థాయి మైనింగ్ అధికారులకు ఫిర్యాదులు చేస్తూ నిరంతరం పోరాటం చేస్తోందని తెలిపారు. ఈ క్రమంలో గనుల శాఖ నిర్వహించిన సర్వేలో తోగ్గూడెం ప్రాంతంలో సుమారు 50 లక్షల క్యూబిక్ మీటర్లకు పైగా అక్రమ తవ్వకాలు జరిగినట్లు అధికార రికార్డులు వెల్లడిస్తున్నాయని పేర్కొన్నారు. మైన్స్ అండ్ జియాలజీ శాఖ విడుదల చేసిన అధికారిక వివరాల ప్రకారం తోగ్గూడెం ప్రాంతంలోని పలువురు క్వారీ లీజ్ హోల్డర్లపై ప్రభుత్వం సుమారు రూ.300 కోట్లకు పైగా డిమాండ్ నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. అయితే ఈ భారీ జరిమానాలను చెల్లించకుండా కొన్ని క్వారీలు రోజువారీగా అక్రమంగా తవ్వకాలు కొనసాగిస్తూ క్రషింగ్ మిల్లులు నడుపుతున్నాయని ఆయన విమర్శించారు. సంవత్సరాలుగా అక్రమంగా ఖనిజాన్ని తవ్వడంతో ప్రభుత్వానికి కోట్ల రూపాయల ఆదాయ నష్టం జరుగుతోందని తెలిపారు. అక్రమంగా తవ్విన ఖనిజాలపై సెయినియరేజ్ ఫీజు మరియు భారీ పెనాల్టీలు విధించినప్పటికీ కొందరు క్వారీ యజమానులు ఇప్పటికీ ప్రభుత్వానికి చెల్లించాల్సిన మొత్తాన్ని చెల్లించకపోవడం ఆశ్చకరమని అన్నారు. ఈ వ్యవహారం వెనుక ఎవరెవరి ప్రమేయం ఉందో ప్రభుత్వం తేల్చాలని డిమాండ్ చేశారు. తోగ్గూడెం ప్రాంతంలో అక్రమ మైనింగ్ కారణంగా ప్రభుత్వానికి వందల కోట్ల రూపాయల నష్టం మాత్రమే కాకుండా పర్యావరణానికి కూడా తీవ్ర నష్టం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ మరియు మైన్స్ శాఖ ఉన్నతాధికారులు వెంటనే ఈ వ్యవహారంపై ప్రత్యేక విచారణ జరిపి అక్రమాలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ప్రభుత్వానికి రావలసిన బకాయిలను వెంటనే వసూలు చేయాలని, ఇన్ని సంవత్సరాలుగా కోట్ల రూపాయల అక్రమ మైనింగ్ చేసిన వారిపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం అక్రమంగా నడుస్తున్న క్వారీలు మరియు క్రషింగ్ మిల్లుల అనుమతులను రద్దు చేసి ప్రజల అవసరాల నిమిత్తం ఆ ప్రాంత గిరిజనులకే కొత్త అనుమతులు ఇచ్చి మైనింగ్ నిబంధనల ప్రకారం కంకర సరఫరా జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఉమ్మడి జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నప్పటికీ రూ.300 కోట్ల విలువైన అక్రమ మైనింగ్ జరుగుతున్నా పట్టించుకోవడం లేదని విమర్శించారు. దీనివల్ల ఈ వ్యవహారంలో ప్రభుత్వ పెద్దల పాత్ర ఎంతవరకు ఉందో ప్రజలకు అర్థమవుతోందని అన్నారు. ఈ అంశంపై ప్రభుత్వం తక్షణమే స్పందించకపోతే భారతీయ జనతా పార్టీ ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతుందని హెచ్చరించారు. అలాగే ఈ కోట్ల రూపాయల అక్రమ మైనింగ్ వ్యవహారంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ మరియు ఇతర కేంద్ర దర్యాప్తు సంస్థలకు ఫిర్యాదు చేయడమే కాకుండా హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం కూడా దాఖలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి నోముల రమేష్,గోడుదు శ్రీధర్,విద్యాసాగర్ (కొత్తగూడెం పట్టణ అధ్యక్షులు),కాల్వ ప్రసాద్,శ్రీనివాస్, మాదారపు లక్ష్మణ్,లింగగిరి వెంకట్రామయ్య ,భూక్య మోహన్,భూక్య ఆశ,కోటేశ్వరావు,పవన్,కొత్తపల్లి విజయ్,బానోత్ బాలాజీ లు పాల్గొన్నారు

# ములుగు: 28. 55 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

**మన దునియా,ములుగు:మార్చి 17**

ములుగు: 28. 55 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత సోమవారం ములుగులో పోలీసులు అక్రమంగా నిల్వ చేసిన 28.55 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై ఉపేందర్ రావు ఆధ్వర్యంలో కూరగాయల మార్కెట్ సమీపంలోని ఎస్డీ. రఫీ ఇంట్లో తనిఖీలు నిర్వహించి, బియ్యం నిల్వలను సీజ్ చేశారు. జాకారానికి చెందిన ఇండ్ల శంకర్తో కలిసి చుట్టుపక్కల గ్రామాల్లో బియ్యాన్ని సేకరించి మహారాష్ట్రకు ఎగుమతి చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశారు.



# ఖానాపూర్ మాజీ శాసనసభ్యులు అజ్మీర గోవింద్ నాయక్ అంత్యక్రియల్లో పాల్గొన్న భూక్యా జాన్సన్ నాయక్ .





**ఖానాపూర్ ఆర్సి మన దునియా (ప్రతినిధి శరత్) మార్చి: 17.**

ఖానాపూర్ నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు అజ్మీర గోవింద్ నాయక్ అంత్యక్రియల్లో మాజీ మంత్రివర్యులు జోగు రామన్న , బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ . మరియు ఇతర ప్రజా ప్రతినిధులు నాయకులతో కలిసి బీఆర్ఎస్ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ ఇంచార్జ్ భూక్యా జాన్సన్ నాయక్ .గోవింద్ నాయక్ భౌతిక కాయానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గోవింద్ నాయక్ ప్రజాసేవలో ఎల్లప్పుడూ ముందుండే నిజమైన ప్రజానాయకుడని, ఖానాపూర్ నియోజకవర్గ అభివృద్ధికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. వారి మృతి నియోజకవర్గ ప్రజలకు, రాజకీయ వర్గాలకు తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషాద సమయంలో గోవింద్ నాయక్ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థించారు. గోవింద్ నాయక్ సేవలను ప్రజలు ఎప్పటికీ గుర్తుంచుకుంటారని, ఆయన ప్రజాసేవా స్ఫూర్తి అందరికీ ఆదర్శంగా నిలుస్తుందని తెలిపారు.

# సూర్య గ్యాస్ ఏజెన్సీపై ఆకస్మిక తనిఖీ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు: అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్

**మన దునియా,భద్రాద్రి కొత్తగూడెం జిల్లా:మార్చి17**




భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అదనపు కలెక్టర్, జిల్లా పౌర సరఫరాల అధికారి డి. వేణుగోపాల్ మంగళవారం సుజాతనగర్‌లోని ఎంఎస్ సూర్య గ్యాస్ ఏజెన్సీ గోదాం మరియు కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోదాంలో ఉన్న ఎల్పీజీ సిలిండర్ల నిల్వలు, స్టాక్ రిజిస్టర్లు, బుకింగ్ విధానం, పంపిణీ ప్రక్రియలను సమగ్రంగా పరిశీలించారు. సరఫరాలో పారదర్శకత పాటిస్తున్నారా లేదా అన్న విషయంపై ప్రత్యేక దృష్టి సారించారు. తనిఖీ అనంతరం మాట్లాడుతూ వినియోగదారులకు ఎల్పీజీ రీఫిల్ సిలిండర్లను సీనియారిటీ క్రమంలోనే అందజేయాలని స్పష్టం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ నిబంధనలకు విరుద్ధంగా గ్యాస్ సిలిండర్ల పంపిణీ జరగకూడదని, అలాంటి అక్రమాలు జరిగితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సకాలంలో గ్యాస్ సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఏజెన్సీ నిర్వాహకులను ఆదేశించారు. గ్యాస్ సరఫరాలో ఆలస్యం, అక్రమాలు, ఫిర్యాదులు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ తనిఖీలో సంబంధిత విభాగాల అధికారులు మరియు ఏజెన్సీ సిబ్బంది పాల్గొన్నారు.

# చావుబతుకుల మధ్య చిన్నారి.. ఆదుకున్న ఖాకీ మనసు!

**"అమ్మా.. నన్ను బతికించుకోవా.." - ఆ చిన్నారి మూగ వేదన.. కొత్తగూడ ఎస్ఐ ఉదారత!**

**మన దునియా మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ,బూరుగు గుంపు మార్చి17**




మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండల కేంద్రంలోని బూరుగు గుంపు గ్రామం మల్లెల అశ్విని – మహేష్ దంపతులకు మూడు నెలల వయసున్న కూతురు ఉంది. ఆ చిన్నారి నవ్వులతో ఆ ఇల్లు కళకళలాడాల్సింది పోయి, నేడు ఆసుపత్రి బెడ్‌పై ఊపిరితిత్తుల వ్యాధితో ప్రాణాల కోసం పోరాడుతోంది. ఆ తల్లిదండ్రుల కళ్ళల్లో కన్నీరు ఆగడం లేదు. ఆసుపత్రి ఖర్చులు భరించలేక ఆ తల్లిదండ్రులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. తమ బిడ్డను కాపాడుకోవాలని వారు పడుతున్న ఆవేదన వర్ణనాతీతం. విషయం తెలుసుకున్న కొత్తగూడ ఎస్ఐ ఇమ్మడి రాజ్ కుమార్ తన వంతు సహాయంగా రూ. 4,000 నగదును ఆ కుటుంబానికి అందజేశారు. కేవలం విధి నిర్వహణే కాదు, తనలో ఉన్న మానవత్వాన్ని చాటుకున్నారు. ఎస్ఐ ఈ చిన్న సాయం ఆ కుటుంబానికి కొండంత అండగా నిలిచింది.

# మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డికి బీఆర్ఎస్ షోకాజ్ నోటీసు

**మన దునియా,హైదరాబాద్,మార్చి17**



భారత రాష్ట్ర సమితి
BHARAT RASHTRA SAMITHI
Office : Telangana Bhavan, Road No : 10, Banjara Hills, Hyderabad 500 034.

తేదీ: 17-03-2026

శ్రీ పైలెట్ రోహిత్ రెడ్డి గారికి
మాజీ శాసనసభ్యులు,
భారత రాష్ట్ర సమితి.

**విషయం: మీరు పాల్గొన్న పార్టీలో మాదకద్రవ్యాల వినియోగం ఆరోపణల గురించి షోకాజ్ నోటీసు**

వివిధ మీడియా నివేదికలు మరియు ఇతర విశ్వసనీయ సమాచారం ద్వారా, హైదరాబాద్ పరిసర ప్రాంతంలో జరిగిన ఒక సమావేశంలో మీరు హాజరై ఉండగా అక్కడ మాదకద్రవ్యాలు వినియోగించబడ్డాయని ఆరోపణలు వెలువడిన విషయం పార్టీ ఉన్నత నాయకత్వం దృష్టికి వచ్చింది. ఈ వార్తలు విస్తృతంగా మీడియాలో ప్రసారం కావడంతో పాటు పార్టీకి మరియు ప్రజల్లో కూడా తీవ్ర ఆందోళన కలిగించాయి.

భారత రాష్ట్ర సమితి పార్టీ ఒక బాధ్యతాయుతమైన రాజకీయ సంస్థగా చట్టపరమైన నిబంధనలు, నైతిక విలువలు పాటించడంలో విశ్వాసం కలిగి ఉంది. అక్రమ కార్యకలాపాలు, ముఖ్యంగా మాదకద్రవ్యాల లేదా మత్తు పదార్థాల వినియోగం లేదా వాటితో ఏ విధమైన సంబంధం కలిగి ఉండడాన్ని పార్టీ పూర్తిగా వ్యతిరేకిస్తుంది.

పై సంఘటనలో మీ హాజరు మరియు ప్రమేయం ఉందనే ఆరోపణలు పార్టీకి తీవ్రమైన అపకీర్తిని తెచ్చి పెట్టడమే కాకుండా పార్టీ ప్రతిష్ఠ, మరియు విశ్వసనీయతకు భంగం కలిగించే అవకాశం కలిగించాయి.

పై విషయాలను దృష్టిలో ఉంచుకొని, పార్టీ అధ్యక్షులు శ్రీ కేసీఆర్ గారి ఆదేశం మేరకు, ఈ నోటీసు అందిన తేదీ నుండి 7 రోజులలోపు మీడియా ద్వారా వచ్చిన ఆరోపణలపై మీ జవాబు స్పష్టంగా వివరిస్తూ సమగ్రంగా లిఖితపూర్వక వివరణ సమర్పించవలసిందిగా మిమ్మల్ని ఈ నోటీసు ద్వారా ఆదేశిస్తున్నాం.

ఈ విషయంపై పార్టీ నాయకత్వం సమగ్రంగా పరిశీలించి తుది నిర్ణయం తీసుకునే వరకు మీరు పార్టీ కార్యక్రమాలు మరియు అధికారిక కార్యక్రమాల్లో పాల్గొనకుండా ఉండవలసిందిగా ఆదేశిస్తున్నాం.

ఈ నోటీస్ గడువు లోపు సంతృప్తికరమైన వివరణ సమర్పించడంలో విఫలమైతే, పార్టీ రాజ్యాంగం మరియు నియమావళి ప్రకారం మీపై తగిన క్రమశిక్షణాత్మక చర్యలు ఎటువంటి అదనపు నోటీసు లేకుండానే తీసుకోబడతాయని గమనించగలరు.

భవదీయులు,
సోమ భరత్ కుమార్ 17/03/2026
ప్రధాన కార్యదర్శి
పార్టీ క్రమశిక్షణ వ్యవహారాల బాధ్యులు

భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీ మాజీ శాసనసభ్యులు పైలెట్ రోహిత్ రెడ్డికి పార్టీ అధిష్ఠానం షోకాజ్ నోటీసు జారీ చేసింది. ఇటీవల హైదరాబాద్ పరిసర ప్రాంతంలో జరిగిన ఓ సమావేశంలో ఆయన హాజరై ఉండగా అక్కడ మాదకద్రవ్యాల వినియోగం జరిగినట్లు వివిధ మీడియా నివేదికలు వెలువడిన నేపథ్యంలో ఈ చర్య తీసుకున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఈ ఆరోపణలు మీడియాలో విస్తృతంగా ప్రచారం కావడంతో పాటు ప్రజల్లో కూడా చర్చనీయాంశంగా మారాయి. దీంతో పార్టీ ప్రతిష్టకు భంగం కలిగించే అంశంగా దీనిని బీఆర్ఎస్ ఉన్నత నాయకత్వం పరిగణించింది. బాధ్యతాయుత రాజకీయ పార్టీగా చట్టపరమైన నిబంధనలు, నైతిక విలువలను పాటించడం తమ ప్రాథమిక ధ్యేయమని పేర్కొంటూ, మాదకద్రవ్యాల వంటి అక్రమ కార్యకలాపాలను పార్టీ పూర్తిగా వ్యతిరేకిస్తుందని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో, పైలెట్ రోహిత్ రెడ్డి ఈ ఆరోపణలపై తమ స్పష్టమైన వివరణను లిఖితపూర్వకంగా సమర్పించాలని పార్టీ ఆదేశించింది. నోటీసు అందిన తేదీ నుండి ఏడు రోజులలోపు పూర్తి వివరణ ఇవ్వాలని పేర్కొంది. ఇదిలా ఉండగా, ఈ వ్యవహారంపై తుది నిర్ణయం తీసుకునే వరకు ఆయనను పార్టీ కార్యక్రమాలు మరియు అధికారిక కార్యకలాపాల నుండి దూరంగా ఉండాలని కూడా ఆదేశించినట్లు సమాచారం. గడువు లోపు సరైన వివరణ ఇవ్వకపోతే పార్టీ రాజ్యాంగం ప్రకారం క్రమశిక్షణాత్మక చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ఈ నోటీసును పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ ఆదేశాల మేరకు జారీ చేసినట్లు, పార్టీ క్రమశిక్షణ వ్యవహారాల బాధ్యులు సోమ భరత్ కుమార్ తెలిపారు.

మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం

## జనంలో రీల్స్ పిచ్చి రోజురోజుకూ విపరీతంగా పెరిగిపోతోంది.



**మన దునియా,ఢిల్లీ:మార్చి 17**

వ్యూస్ కోసం కొందరు ప్రాణాలను పణంగా పెడుతున్నారు. తాజాగా దిల్లీలో అలాంటి ఘటనే చోటుచేసుకుంది.తుపాకీతో స్టంట్ చేయబోయి ఓ యువకుడు మృతి చెందాడు. లోడ్ చేసిన గన్తో రీల్ చేస్తుండగా.. అది పేలి అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. మృతుడిని తూర్పు దిల్లీకి చెందిన పవన్గా గుర్తించారు.పవన్ ఈ రీల్ చేస్తుండగా పక్కనున్న స్నేహితుడు దాన్ని రికార్డ్ చేశాడు. బటన్ ఎలా నొక్కాలో మిత్రుడు చెబుతుంటే.. పవన్ తుపాకీని లోడ్ చేశాడు. ఆ తర్వాత గన్ ను ఛాతీకి గురిపెట్టుకొని కెమెరా వైపు చూసి నవ్వాడు. వీడియో రికార్డు చేస్తున్న వ్యక్తి 'కాల్చొద్దు అన్నా..' అని చెప్పినప్పటికీ.. పవన్ కంగారులో ట్రిగ్గర్ నొక్కేశాడు. దీంతో బుల్లెట్ గుండెల్లోకి దూసుకెళ్లి.. ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు.అతడిని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ తుపాకీ వీడియో రికార్డు చేసిన పవన్ స్నేహితుడిదేనని పోలీసులు తెలిపారు. దానికి లైసెన్స్ ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు

## కోరుట్ల: జగిత్యాల జిల్లాలో దారుణం జరిగింది. నాలుగు నెలల గర్భవతిగా ఉన్న భార్యపై భర్త కత్తితో దాడి చేసి చంపాడు.



**మన దునియా,కోరుట్ల, మాదాపూర్:మార్చి 17**

కోరుట్ల మండలం మాదాపూర్లో ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు ప్రాథమికంగా తెలిపిన వివరాల ప్రకారం.. 8 నెలల క్రితం కోరుట్లకు చెందిన చిత్తరి హరిబాబు, మాదాపూర్కు చెందిన వైష్ణవి (19) ప్రేమ వివాహం చేసుకున్నారు. అప్పటి నుంచి మాదాపూర్లోనే నివాసముంటున్నారు. హరిబాబు ప్రభుత్వ ఆస్పత్రిలో ఒప్పంద పద్ధతిలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. వైష్ణవి రీల్స్ చేస్తూ యూట్యూబ్ ఛానల్ నడిపిస్తోంది. గత కొద్దిరోజులుగా వీరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. మంగళవారం వేకువజామున 4 గంటలకు వైష్ణవిపై హరిబాబు కత్తితో దాడి చేశాడు. అనంతరం అక్కడి నుంచి పరారయ్యాడు. ఉదయం కుటుంబసభ్యులు చూసేసరికి రక్తపుమడుగులో వైష్ణవి పడి ఉంది. పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# కుక్కకాటుకు గురైన బాలుడికి 15 నెలలుగా చికిత్స

### రూ.50 లక్షలు ఖర్చు చేసినా దక్కని ప్రాణం

**మన దునియా,జగిత్యాల జిల్లా వెల్గటూరు,కోటిలింగాల:మార్చి 17**



జగిత్యాల జిల్లా వెల్గటూరు మండలం కోటిలింగాల గ్రామంలో, 2024 డిసెంబర్ 26వ తేదీన ఇంటి బయట ఆడుకుంటున్న శ్రీనివాస్ -- మాధవి దంపతుల కుమారుడు మణితేజ(8)ను కరిచిన వీధికుక్క ఆసుపత్రికి వెళ్లి టీకా వేయించి, ఇంటికి తీసుకెళ్లాక జ్వరం రావడంతో జగిత్యాలలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా, హైదరాబాద్ నగరానికి తరలించాలని తెలిపిన అక్కడి వైద్యులుహైదరాబాద్ నగరంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా, వెన్నుముక్క నుండి మెదడుకు వెళ్లే నరం దెబ్బతిన్నదని తెలిపిన వైద్యులుఅప్పటినుండి శరీర కదలికలు తప్ప ఎలాంటి స్పందన లేకుండా ఉండడంతో, పూర్తిగా వెంటిలేటర్ మీదనే చికిత్స అందజేతబాలుడి ప్రాణాలు కాపాడుకునేందుకు వివిధ రకాలుగా రూ.50 లక్షలు ఖర్చు చేసినా కూడా బాలుడు మృతిచెందడంతో కన్నీటి పర్యంతమైన తల్లిదండ్రుల్ను

# ఆ తరం వెళ్ళిపోతోంది.!

**మన దునియా,హైదరాబాద్ డెస్క్: మార్చ్ 17**

ఒక్కొక్కరుగా మనకు శాశ్వత వీడ్కోలు పలుకుతూ ఒక తరం కనుమరుగవుతోంది.

అన్నం తినేముందు ఇతరుల ఆకలిని గుర్తించిన తరం.

ఇరుకు ఇళ్లల్లో గొప్ప ప్రేమతో బ్రతికిన తరం. బాధ్యతల్ని ఎరిగిన తరం.

'నేను' అనకుండా 'మనం' అంటూ బతికిన తరం.

డిగ్రీలు లేకున్నా, జీవితాన్ని చదివిన తరం.

గడియారం లేకున్నా, సమయాన్ని సద్వినియోగం చేసుకున్న తరం.

ఇంటర్నెట్ చూడకుండా జ్ఞానాన్ని నింపుకున్న తరం.

కాలిక్యులేటర్ లేకున్నా లెక్కలు చేయగలిగిన తరం.

మొబైల్ ఫోన్ లు లేకున్నా స్నేహ సంభాషణలకు లోటు లేని తరం.

టీవీలు లేకున్నా వినోదంగా కాలం గడిపిన తరం.

జిపిఎస్ లు లేకున్నా గమ్యం ఖచ్చితంగా చేరగలిగిన తరం.

సాంకేతికత లేకున్నా సుఖసంతోషాలతో బతికిన తరం.

ఏసీలు, కూలర్లు లేకున్నా ఆరుబయట హాయిగా నిద్రించిన తరం.

మినరల్ వాటర్ కు బదులు చెరువు/బావి నీళ్లు తాగి ఆరోగ్యంగా బతికిన తరం.

పిజ్జాలు, బర్గర్లు కాకుండా పీచు మిఠాయిలు, పేలాలు తిని ఆనందంగా బ్రతికిన తరం.

రాత్రిళ్ళు ఇంటి అరుగులపై హాయిగా కబుర్లు చెప్పుకుంటూ ఆనందంగా బ్రతికిన తరం.

ఆరో ఏడు వచ్చే వరకు పిల్లల బాల్యాన్ని ఆటపాటలతో నింపిన తరం.

ఆ తర్వాత పైసా ఫీజు లేని సర్కారు బడుల్లో తెలుగు మీడియంలో పిల్లలను చదివించి - అటు తెలుగు లోనూ, ఇటు ఇంగ్లీష్ లోనూ పండితులు అయ్యేలా పిల్లలను తీర్చిదిద్దిన తరం.

కిలోమీటర్ల దూరాన్ని సైతం అవలీలగా నడవగలిగిన తరం. క్రమశిక్షణ తప్పిన పిల్లవాడికి స్కూల్ లో టీచర్ నాలుగు దెబ్బలు వడ్డిస్తే - వాడికి మరో పది దెబ్బలు ఇంట్లో వడ్డించిన తరం. వీధి నాటకాలను, తోలు బొమ్మలాటలను, బుర్రకథలను ఆస్వాదించిన తరం.



సెన్సార్ అవసరం లేని సందేశాత్మక నలుపు-తెలుపు సినిమాలు చూసిన తరం. ఇంటిముంగిటిని ముగ్గులతో అలంకరించిన తరం. పనిమనుషులతో, యోగాలతో, జిమ్ లతో పని లేకుండా, బండెడు చాకిరీ చేసుకుంటూ, చెమటను చిందించి వందేళ్లు బతికిన తరం. బంధాలకు, బంధుత్వాలకు విలువనిచ్చిన తరం.

ఆస్తులకన్నా, ఆప్యాయతలకు, అనుబంధాలకు ప్రాముఖ్యతనిచ్చిన తరం.

ఉమ్మడికుటుంబాలుగా ఆనందంగా జీవించిన తరం.

భేదాభిప్రాయాలున్నా అందర్నీ కలుపుకుని వెళ్ళగలిగిన తరం.

వ్యాపారంలో కల్తీకి చోటివ్వని తరం. ఇతరుల మేలు కోరుకున్న తరం.

నీతి నిజాయితీలతో మోసాలు చెయ్యకుండా బతికిన తరం.

రాళ్లు తిన్నా అరిగించుకోగలిగిన తరం.

కార్పొరేట్ హాస్పిటల్స్ లేకున్నా ఆరోగ్యంగా జీవించిన తరం.

హార్ట్ ఎటాక్, క్యాన్సర్ ల గురించి తెలియని తరం.

బీపీలు, షుగర్ లను దరిచేరనీయని తరం. లాంతర్లతో జీవితంలో వెలుగులు నింపుకున్న తరం. కష్టాల్ని ధైర్యంగా ఎదుర్కొన్న తరం. ఎంత ఉన్నా ఇంకా ఇంకా కావాలనే దురాశ లేకుండా ఆనందంగా జీవించిన తరం. ఆడంబరాలకు దూరంగా ఉన్న తరం. పోస్ట్ కార్డులపై సంభాషణలు జరిపిన తరం. త్యాగాలతో పిల్లల భవిష్యత్ కు పునాదులు వేసిన తరం. కులమతాలకు అతీతంగా సోదరభావంతో బతికిన తరం. అలాంటి తరంలోని అపురూపమైన వ్యక్తులు నేడు ఒక్కొక్కరుగా మనల్ని విడిచి వెళ్లిపోతున్నారు. వారిని కోల్పోతుంటే సర్వం కోల్పోతున్నట్టుగా అనిపిస్తుంది. వెళ్లిపోతున్న ఆ తరం వాళ్ల నుండి ఈ తరం ఏమీ నేర్చుకోకపోతే - భవిష్యత్తు అంధకారమే!

# వారం రోజులు వానలు.. బుధ, గురువారాల్లో వర్షాల తీవ్రత, వడగండ్ల ముప్పు

**మన దునియా,హైదరాబాద్: మార్చి 17**

రాష్ట్రంలో సోమవారం సాయంత్రం పలు జిల్లాల్లో ఈదురుగాలులు, వడగండ్లతో మోస్తరు వర్షం పడింది. దీంతో చేతికందిన పంటలు నేలవాలిపోయాయి. హైదరాబాద్ నగరంలోనూ చిరుజల్లులు పడ్డాయి.రాష్ట్రంలో అత్యధికంగా సంగారెడ్డి జిల్లా పల్వట్లలో 5.6 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.మెదక్ జిల్లా నర్సాపూర్లో 2.8, సంగారెడ్డి జిల్లా గుమ్మడిదలలో 2.5 చొప్పున వర్షం పడింది. రాష్ట్రవ్యాప్తంగా మరో వారం రోజుల పాటు వర్షాలు పడుతాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో అన్ని జిల్లాలకూ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. వడగండ్లు, పిడుగులు పడే ప్రమాదం ఉందని హెచ్చరించింది.

హైదరాబాద్ : రాష్ట్రంలో అకాల వర్షాలు మొదలయ్యాయి. సోమవారం సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల్లో ఈదురుగాలులు, వడగండ్లకు తోడు మోస్తరు వర్షం పడింది. దీంతో చేతికంది వచ్చిన పంటలు నేలవాలిపోయాయి. మరో వైపు హైదరాబాద్ నగరంలోనూ చిరుజల్లులు పడ్డాయి. రాష్ట్రంలో అత్యధికంగా సంగారెడ్డి జిల్లా పల్వట్లలో 5.6 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.మెదక్ జిల్లా నర్సాపూర్లో 2.8, సంగారెడ్డి జిల్లా గుమ్మడిదలలో 2.5, మానూరులో 2, మెదక్ జిల్లా శివంపేటలో 1.8, కామారెడ్డి జిల్లా సోమూరులో 1.5, పాతరాజంపేటలో 1.3 సెంటమీటర్ల చొప్పున వర్షం పడింది. హైదరాబాద్ సిటీలో సాయంత్రం ఆరు గంటల తర్వాత వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. గాలిదుమారంతో పాటు పలుచోట్ల ఈదురుగాలులు




వీచాయి.

వారం రోజులు వానలు..

రాష్ట్ర వ్యాప్తంగా మరో వారం రోజుల పాటు వర్షాలు పడుతాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో అన్ని జిల్లాలకూ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. వడగండ్లు, పిడుగులు పడే ప్రమాదం ఉందని హెచ్చరించింది. గంటకు 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని పేర్కొంది. ముఖ్యంగా బుధ, గురువారాల్లో వర్షాల తీవ్రత, వడగండ్ల ముప్పు అధికంగా ఉంటుందని హెచ్చరించింది. హైదరాబాద్ నగరంలోనూ వారం రోజుల పాటు సాయంత్రం వేళల్లో వర్షాలు పడే అవకాశం ఉందని వెల్లడించింది.

## నేతకాని సంఘం ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత!!

**ఖానాపూర్ ఆర్సి మన దునియా (ప్రతినిధి శరత్) మార్చ్: 17.**

జన్నారం మండలంలోని కామన్ పల్లి గ్రామంలో విషాదం చోటుచేసుకుంది.గ్రామానికి చెందిన జునుగురు ఊషయ్య గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ,మంగళవారం ఉదయం తన నివాసంలో కన్నుమూశారు.ఆయన మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.ఊషయ్య మరణ వార్త తెలుసుకున్న కామన్ పల్లి నేతకాని సంఘం సభ్యులు తక్షణమే స్పందించారు.బాధిత కుటుంబాన్ని పరామర్శించి,తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ఈ క్లిష్ట సమయంలో ఆ కుటుంబానికి అండగా ఉండాలనే ఉద్దేశంతో సంఘం తరపున 5,000 రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు తుంగూరి గోపాల్,గడ్డి జగన్,జునుగురు వెంకటేష్,జునుగురు లచ్చన్న, జునుగురు రాజన్న,పసుల పోషన్న,దుర్గం రాజయ్య,జునుగురు బాణయ్య,పసుల రాయలింగు మరియు సభ్యులు పాల్గొని,ఊషయ్య ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు.ఆపదలో ఉన్న తమ తోటి సభ్యుని కుటుంబానికి అండగా నిలిచిన నేతకాని సంఘం సభ్యులను గ్రామస్తులు అభినందించారు.



# రోహిత్‌రెడ్డి ఫాంహౌస్‌పై ప్రత్యేక నిఘా!


- అజీజ్‌నగర్ ఫాంహౌస్‌లో డ్రగ్స్ పార్టీ, కాల్పుల కలకలం కేసులో పోలీసులు కీలక విషయాలు..?

**మన దునియా,అజీజ్‌నగర్: మార్చి 17**

మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డికి చెందిన అజీజ్‌నగర్ ఫాంహౌస్‌లో డ్రగ్స్ పార్టీ, కాల్పుల కలకలం కేసులో పోలీసులు కీలక విషయాలు రాబట్టే ప్రయత్నం చేస్తున్నారు.విందులో వాడిన కొకైన్ ఎవరు సరఫరా చేశారు..? ఎంత కాలం నుంచి ఇక్కడ డ్రగ్స్ పార్టీలు జరుగుతున్నాయి..? ఎప్పుడెప్పుడు జరిగాయి? ఎవరెవరు వస్తుంటారు..? తదితర అంశాలపై లోతుగా ఆరా తీస్తున్నారు. ఎమ్మెల్యేల కొనుగోలు కేసు తర్వాత ఇక్కడ పలుసార్లు విందులు జరిగినా ఎవరూ పట్టించుకోలేదు. తాజా ఘటన నేపథ్యంలో నిశిత పరిశీలన చేస్తున్నారు.

ఫాంహౌస్‌లో పార్టీలు...

నెలలో రెండు, మూడుసార్లు రోహిత్‌రెడ్డి ఫాంహౌస్‌లో పార్టీలు నిర్వహిస్తుంటారని తెలుస్తోంది. అప్పుడప్పుడు తప్ప ప్రతిసారీ కొత్త వ్యక్తులే వస్తారనే ప్రచారం ఉంది. ఇలా ఇప్పటివరకు వచ్చ?చనవారిపై పోలీసులు ఫోకస్ పెట్టారు. పార్టీలో విదేశీ మద్యం, గాంజా, డ్రగ్స్ వినియోగించారా? ఎక్కడినుంచి వచ్చాయి. ఎవరు తెచ్చారు. ఎవరెవరు తీసుకున్నారు? అనే



వివరాలను రాబడుతున్నారు. వరుస వివాదాల నేపథ్యంలో గట్టి నిఘా పెట్టారు. డ్రగ్స్ పార్టీ, కాల్పుల తర్వాత ఎవరెవరు వచ్చారనేది తెలుసుకునేందుకు గస్తీ కాస్తున్నారు. ఇంకా ఎవరికైనా సంబంధం ఉందా? అనే కోణంలోనూ విచారణ కొనసాగుతోంది.

# మతసమరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు





**బిభక్తిశ్రద్ధలతో ఇఫ్తార్ విందు**
**బిముస్లిం సోదరుల కలయికతో వెల్లు విరిసిన సోదరభావం**
**బికాల్వ రవి ఆధ్వర్యంలో ఘనంగా ఇఫ్తార్ విందు**

**ఖానాపూర్ ఆర్సి మన దునియా (ప్రతినిధి శరత్) మార్చి: 17,**

మంచిర్యాల జిల్లా జన్నారం మండలం కవ్వాల్ గ్రామంలో పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని కాల్వ రవి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందు అత్యంత వైభవంగా ఆధ్యాత్మిక వాతావరణంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కులమతాలకు అతీతంగా అందరూ కలిసిమెలిసి ఉండాలని సంకల్పంతో ఈ ఇఫ్తార్ విందును ఏర్పాటు చేసినట్లు కాల్వ రవి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదిత్య పిల్లల హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ మగ్గిడి తిరుపతి మరియు జనం పవర్ పాత్రికేయులు తుడుం జితేందర్, జన్నారం కాంగ్రెస్ మండల అధ్యక్షులు ముజాఫర్ అలీ ఖాన్, బి ఆర్ ఎస్ మాజీ కోఆప్షన్ సభ్యులు మున్వర్ బిఆర్ఎస్ సీనియర్ నాయకులు ఫజల్ ఖాన్, కవ్వాల్ గ్రామ ఉపసర్పంచ్ నల్ల తీగల విష్ణు, 9వార్డు సభ్యులు గుడ్ల సాయికుమార్ ,యాదగిరి సుధాకర్ రావు, షాకిర్, రంజిత్, శేఖర్, రాజు, రంగు రాకేష్ , మోసిన్ , తారుఫ్, మత పెద్దలు యువకులు తదితరులు పాల్గొన్నారు.

# పెన్ పహాడ్‌లో ఎల్లమ్మ తల్లి ఉత్సవాలు ఘనంగా





**సూర్యాపేట నియోజకవర్గం**

పెన్ పహాడ్ మండలంలోని దోసపహాడ్ గ్రామంలో మాజీ ఎంపిటిసి గద్దల నాగరాజు గారి నివాసంలో శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి పండుగకు హాజరైన ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి గారు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి గారు, రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకులు పోతు భాస్కర్ గారు, పెన్ పహాడ్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తూముల సురేష్ రావు గారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ కొండపల్లి దిలీప్ రెడ్డి, శ్రీ దండు మైసమ్మ దేవస్థానం చైర్మన్ తంగేళ్ళ కరుణాకర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులు మద్దెబోయిన శ్రీనివాస్, ముహమ్మద్ అబ్దుల్ వాజిద్



మియా తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ఆరు గ్యారెంటీల అమలులో విఫలం

**జన్నారం మండల బీజేపీ అధ్యక్షులు మధుసుధన్ రావు ఆధ్వర్యంలో ఎం.ఆర్.ఓ కు వినతి పత్రం అందజేత**

**ఖానాపూర్ ఆర్సి మన దునియా (ప్రతినిధి శరత్) మార్చి:17,**




మంచిర్యాల జిల్లా జన్నారం మండల కేంద్రంలో ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శిస్తూ, ఈరోజు భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో జన్నారం మండల రెవెన్యూ అధికారి కి వినతి పత్రాన్ని అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ, అధికారంలోకి వచ్చి ఇన్ని రోజులవుతున్నా పేద ప్రజలకు ఇచ్చిన ఒక్క హామీని కూడా పూర్తిస్థాయిలో నెరవేర్చలేదని మండిపడ్డారు. ముఖ్యంగా రైతు భరోసా, మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఆర్థిక సాయం, మరియు నిరుద్యోగ భృతి వంటి కీలకమైన వాగ్దానాలు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయని ఆరోపించారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి అర్హులైన లబ్ధిదారులందరికీ ఆరు గ్యారెంటీలను వర్తింపజేయాలని, లేనిపక్షంలో ప్రజల పక్షాన పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల,జిల్లా నాయకులు, కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.

# పశ్చిమ ఆసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతల కారణంగా వేలాది విమాన సర్వీసులను రద్దు : రామ్మోహన్ నాయుడు

**మన దునియా,న్యూఢిల్లీ:మార్చి 17**



పశ్చిమ ఆసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతల కారణంగా వేలాది విమాన సర్వీసులను రద్దు చేయాల్సి వచ్చిందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. సోమవారం నాడు పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఆయన లోక్‌సభలో ఈ వివరాలను వెల్లడించారు. ఈ సంక్షోభం వల్ల భారత విమానయాన సంస్థలు 4,335 విమానాలను, విదేశీ సంస్థలు 1,187 విమానాలను రద్దు చేశాయని ఆయన పేర్కొన్నారు. ప్రయాణికుల భద్రతకే ప్రభుత్వం, విమానయాన సంస్థలు అత్యంత ప్రాధాన్యత ఇస్తాయన్నారు.సంఘర్షణ ప్రభావిత ప్రాంతాల్లో గగనతలాన్ని మూసివేసినప్పుడు అక్కడ విమానాలు నడపాల్సిన అవసరం లేదు అని ఆయన స్పష్టం చేశారు.అయితే, విమానాల రద్దుతో అంతరాయం ఏర్పడినప్పటికీ, ఈ ఉద్రిక్త పరిస్థితుల మధ్య కూడా దాదాపు 2,19,780 మంది ప్రయాణికులు ప్రయాణించినట్లు మంత్రి తెలిపారు. భారత విమానయాన నియంత్రణ సంస్థ పౌర విమానయాన మంత్రిత్వ శాఖ అధికారులు ప్రభావిత ప్రాంతాల అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ పరిస్థితిని సమీక్షిస్తున్నారని వివరించారు. ఆయా ప్రాంతాల్లో గగనతలం తిరిగి తెరుచుకున్న తర్వాతే విమాన సర్వీసులు సాధారణ స్థితికి వస్తాయని రామ్మోహన్ నాయుడు వెల్లడించారు.

# కాకతీయ వర్సిటీలో చోరీ నెపం.. మనస్తాపంతో విద్యార్థిని మృతి.


**మన దునియా,హనుమకొండ: మార్చి 17**



కేయూలో ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్రీ రెండో సంవత్సరం చదువుతున్న ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం బనిగండ్లపాడుకు చెందిన శ్రీవిద్య (20) పద్మాక్షి హాస్టల్ బి--బ్లాక్‌లో ఉంటున్న సమయంలో కొందరు సీనియర్ విద్యార్థులతో వివాదం ల్యాప్ టాప్, బంగారం చోరీ చేసిందని ఆరోపిస్తూ శ్రీవిద్యపై ఈనెల 2న వర్సిటీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుఆ వస్తువులకు సంబంధించి డబ్బు చెల్లించాలని శ్రీవిద్య తల్లిదండ్రులకు పోలీసుల సమాచారం పోలీసుల విచారణ అనంతరం శ్రీవిద్యను ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా దుందిరాలపాడు గ్రామంలోని అమ్మమ్మ ఇంటికి తీసుకెళ్ళిన తల్లి అంజమ్మ మనస్థాపంతో ఈనెల 7న ఎలుకలు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన శ్రీవిద్య తనపై సహచర విద్యార్థులు దాడి చేశారని వీడియోలో తెలిపిన శ్రీవిద్య హైదరాబాద్ నిమ్స్ లో చికిత్స పొందుతూ మృతి.. ఈ ఘటనపై మధిర పీఎస్‌లో తల్లిదండ్రుల ఫిర్యాదు.

# ప్రసూతి సెలవులపై సుప్రీంకోర్టు కీలక తీర్పు

**మన దునియా,న్యూఢిల్లీ:మార్చి 17**



ప్రసూతి సెలవుల విషయంలో సుప్రీంకోర్టు సంచలన తీర్పు ఇచ్చింది. దత్తత తీసుకున్న బిడ్డ వయసు మూడు నెలల కంటే తక్కువ ఉంటేనే ప్రసూతి సెలవులకు అర్హత అనేది సరికాదని, దీనికి అనుమతించే సోషల్ సెక్యూరిటీ కోడ్ 2020లోని సెక్షన్ 60(4) రాజ్యాంగ విరుద్ధమని అత్యున్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది. చిన్నారి వయసుతో సంబంధం లేకుండా దత్తత తీసుకున్న సమయం నుంచి 12 వారాల పాటు ప్రసూతి సెలవులు తీసుకునేందుకు మహిళలకు అర్హత ఉంటుందని తెలిపింది..

మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం

# అశ్వాపురం మండలంలో విచ్చలవిడిగా ఇటుక బట్టీలు...

**మన దునియా,అశ్వాపురం: మార్చి 17**


ఏజెన్సీ ప్రాంతంలో ఇటుక బట్టీలకు అనుమతులు ఉన్నాయా? అసలు ఇటుక బట్టీలకు ఏ అనుమతులు కావాలి ఇటుక బట్టీలకు అవసరమైనటువంటి బంక మట్టి ఎక్కడి నుంచి వస్తుంది అనుమతులు లేని తుమ్మల చెరువు మట్టి తోలకాలు జరుగుతున్నాయా జరిగితే సంబంధిత అధికారులు ఎందుకు స్పందించడం లేదు ఇటుక బట్టీలలో పని చేసేటటువంటి అమాయక చత్తీస్గడ్ ఒరిస్సా గిరిజనులకు కార్మిక చట్టాల ప్రకారం పని గంటలు ఉంటున్నాయా లేక శ్రమ దోపిడీ జరుగుతుందా? అక్కడ బాల కార్మికులు కూడా మగ్గుతున్నారా ఇటుక బట్టీలు కాల్చడానికి కావలసినటువంటి కలప ఎక్కడి నుంచి వస్తుంది కలపతో కాకపోతే ఏ విధంగా కాలుస్తున్నారు? కాల్చటానికి కావలసిన ముడి సరుకు ఎక్కడి నుంచి వస్తుంది ఫారెస్ట్ భూములలో కూడా ఇటుక బట్టీలు ఉన్నాయా ఇన్ని ఇటుక బట్టీలు నడుస్తూ ఉంటే వచ్చే పొల్యూషన్ వల్ల వాతావరణం పాడైపోయి, ఆ చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలకు ఆరోగ్యం దెబ్బతిని, శ్వాసకోశ రోగాలు వచ్చే అవకాశాలు ఉన్నాయి పొల్యూషన్ బోర్డు పర్మిషన్లు ఉన్నాయా? అసలేం జరుగుతుంది అశ్వాపురం మండలంలో కొంతమంది వ్యక్తులు సిండికేట్ గా ఏర్పడి అనుమతులన్నీ లేకుండా ఇష్టానుసారంగా నిర్వహిస్తున్నటువంటి ఇటుక బట్టీలపై సంబంధిత అధికారులకు ఫిర్యాదులు, మరియు పూర్తి ఆధారాలతో వరుస కథనాలు త్వరలో...

# అలాంటివారు ఈ పండు తినకండి!

జామ పండు.. పేదల ఆపిల్ గా పేరు దక్కించుకున్న జామ పండు అన్ని సీజన్లో విరివిగా లభిస్తుంది. దానిమ్మ పండ్లతో పోల్చుకుంటే ఖర్చు కూడా చాలా తక్కువ. చిన్న పెద్ద అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరు కూడా జామ పండును ఎంతో ఇష్టంగా తింటారు. జామపండు పోషకాలకు నిలయం అని చెప్పవచ్చు. ఇకపోతే జామ పండు తినడం వల్ల శరీరానికి ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు కూడా లభిస్తాయి.. అయితే కొంతమందికి జామపండు పడదు. కొంతమందికి సైడ్ ఎఫెక్ట్స్ కూడా వస్తాయి. ఇంకొంతమంది ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటారు. ఇకపోతే ఎలాంటి ఆరోగ్య సమస్యలు ఉన్నవారు జామ పండు తినకూడదో ఇప్పుడు చూద్దాం. జామ పండు చలికాలంలో తింటే బోలెడు ప్రయోజనాలు కలుగుతాయి. ఇందులో ఉండే విటమిన్ సి ఇమ్యూనిటీ పవర్ ను పెంచుతుంది. జామ పండు తినడం వల్ల రక్తపోటు తగ్గడంతో పాటు గుండె ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది. జామ పండులో ఉండే విటమిన్ ఏ కంటి ఆరోగ్యాన్ని పెంచుతుంది. అలాగే శరీరానికి కావలసిన విటమిన్ డి కూడా లభిస్తుంది. ఇన్ని పోషకాలు ఉన్న జామ పండు కి కొంత మంది దూరంగా ఉండాలి.అలర్జీ సమస్యలతో బాధపడేవారు జామపండు తినకపోవడం మంచిది. అలాగే చర్మవ్యాధులు, శ్వాసకోశ వ్యాధులతో బాధ పడే వారు కూడా జామపండు తినకూడదు. జామ పండు తింటే చర్మం పై దద్దుర్లు, మంట, వాపు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఇలాంటి సమస్యలు ఉన్నవారు జామపండుకు దూరంగా ఉండటమే మేలు అని నిపుణులు చెబుతున్నారు. అలాగే గ్యాస్ట్రిక్, ఎసిడిటీ వంటి సమస్యలు ఉన్నవారు కూడా జామ పండుకు దూరంగా ఉండాలి. జామ పండు జీర్ణం అవ్వడానికి ఎక్కువ సమయం పడుతుంది కాబట్టి జీర్ణ సంబంధిత సమస్యలు ఉన్నవారు కూడా జామ పండుకు దూరంగా ఉండటమే మంచిది.



# ఈ ప్రశ్నలకు బదులేది?




**మన దునియా,డెస్క్:మార్చి 17**

ఇజ్రాయిల్-అమెరికా దాడులతో ప్రారంభమైన ఇరాన్ యుద్ధం భారత ఆర్థిక వ్యవస్థ, ఇంధన భద్రత, రూపాయి విలువ, ఉద్యోగాలపట తీవ్ర ప్రభావం చూపుతోంది. కేంద్రం ముందస్తు ప్రణాళిక లేకుండా వ్యవహరించడంతో భారత్‌లో కఠిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. మోడీ సర్కారుకు ముందు చూపు లోపించడం, పరిస్థితులను అంచనా వేయడంలో విఫలం కావడం, ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించకపోవడం కారణంగా దాని భారం ప్రజలపై పడుతోందని విశ్లేషకులు అంటున్నారు.

కేంద్రం తీరుతో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్తున్నారు. మధ్యప్రాచ్యంలో యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో మోడీ ప్రభుత్వం తీరుపట అనేక ప్రశ్నలు, సందేహాలు తలెత్తుతున్నాయి. ఈ పరిస్థితుల నేపథ్యంలో కేంద్రానికి విశ్లేషకులు ఎనిమిది ప్రశ్నలను సంధిస్తున్నారు.

1. యుద్ధానికి ముందు మోడీ ఇజ్రాయిల్ పర్యటన ఎందుకు?

ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయిల్ దాడులకు ముందుగా ప్రధాని మోడీ ఇజ్రాయిల్ పర్యటనకు వెళ్లడం చర్చనీయాంశంగా మారింది. అది ఇప్పుడు తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది. అమెరికా, ఇజ్రాయిల్‌లు యుద్ధానికి దిగే అవకాశాలున్నాయంటూ ప్రపంచ మీడియా సైతం కోడై కూస్తున్న తరుణంలో మోడీ ఇజ్రాయిల్ పర్యటనకు వెళ్లారు. అయితే మోడీ ఇజ్రాయిల్‌కు వెళ్లకుండా భారత్‌లోనే ఉండాల్సిందనీ, అత్యవసర ప్రణాళికలు రూపొందించాల్సిందని విశ్లేషకులు చెప్తున్నారు.

2. యుద్ధం వచ్చే సూచనలే కనిపించలేదా?

అమెరికా-ఇజ్రాయిల్, ఇరాన్ మధ్య యుద్ధం అకస్మాత్తుగా సంభవించింది కాదు. వీటి మధ్య గత కొన్ని నెలలుగా ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. అయినా భారత ప్రభుత్వం ఈ యుద్ధాన్ని ఊహించలేకపోయిందా లేదా ఊహించినా తగిన చర్యలు తీసుకోలేకపోయిందా అనే సందేహాలు సర్వత్రా కలుగుతున్నాయి.

3. చైనా లాగా ఇంధన నిల్వలు ఎందుకు పెంచలేదు?

భారత్ పొరుగు దేశమైనా చైనా మధ్యప్రాచ్యంలోని పరిస్థితులను ముందుగానే పసిగట్టింది. వెంటనే అప్రమత్తమైంది. యుద్ధం వచ్చే అవకాశం ఉందని ముందుగానే భారీ చమురు నిల్వలు సేకరించింది. కానీ భారత్ మాత్రం ఈ విషయంలో పూర్తిగా విఫలమైంది. తక్కువ నిల్వలతో తాజా సంక్షోభంలోకి ప్రవేశించింది. దీంతో చైనా లాగా భారత్ తన ఇంధన నిల్వలు ఎందుకు పెంచలేదో కేంద్రం సమాధానం చెప్పాలనే ప్రశ్న తలెత్తుతోంది.

4. కొరత నేపథ్యంలో ఇంధన ఎగుమతులు ఎందుకు?

మధ్యప్రాచ్యంలోని యుద్ధ పరిస్థితులతో కొన్ని దేశాలు వెంటనే అలర్ట్ అయ్యాయి. తమ ఇంధన ఎగుమతులను నిలిపివేశాయి. కానీ భారత్ మాత్రం ఇంకా డీజీల్, పెట్రోల్ ఎగుమతులను కొనసాగిస్తోంది. దీంతో దేశీయ వినియోగదారులకు భవిష్యత్తులో కొరత వచ్చే ప్రమాదం ఉందని విమర్శలు వినిపిస్తున్నాయి.

5. హోర్ముజ్ మూసుకుపోతే ప్రత్యామ్నాయం ఏమిటీ?

ప్రపంచ చమురు సరఫరాలో కీలకమైంది హోర్ముజ్ జలసంధి. దీనిపై ఇరాన్‌కు పట్టుంది. దీంతో ఈ జలసంధి గుండా జరిగే నౌకాయానంపై ఇరాన్ ఆంక్షలు కొనసాగుతున్నాయి. అమెరికా, దానికి సహకరించే దేశాలకు ఇక్కడ అనుమతి నిరాకరిస్తోంది. ప్రస్తుతం భారత్‌కు కొంత సానుకూల పరిస్థితులే ఉన్నా.. ఒకవేళ హోర్ముజ్ పూర్తిగా మూసుకుపోతే కేంద్రం వద్ద ఏవైనా ప్రత్యామ్నాయ చర్యలున్నాయా..? అంటే అందుకు భారత ప్రభుత్వం వద్ద సరైన సమాధానం లేదనే చెప్పాలి. ఇక్కడ కూడా కేంద్రానికి ముందస్తు ప్రణాళిక కరువైందని విశ్లేషకులు చెప్తున్నారు.

6. రష్యా, ఇరాన్ చమురు దిగుమతులు ఎందుకు తగ్గాయి?

మోడీ సర్కారు హయాంలో భారత దౌత్యం కొత్త పుంతలు తొక్కుతోందని బీజేపీ ప్రచారం చేసుకుంటోంది. వాస్తవ పరిస్థితులను బట్టి చూస్తే మోడీ దౌత్యం.. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చేతిలో ఉందనే విమర్శలూ ఉన్నాయి. అమెరికా ఒత్తిడితో భారత్ రష్యా, ఇరాన్ చమురు దిగుమతులను తగ్గించిందని విశ్లేషకులు చెప్తున్నారు. ఫలితంగా భారత్ చౌకైన చమురు అవకాశాన్ని కోల్పోయిందని అంటున్నారు. దీని భారం ఇప్పుడు దేశ ప్రజలు భరిస్తున్నారని వారు వెల్లడిస్తున్నారు.

7. ఇరాన్ నాయకత్వం హత్యపై కేంద్రం మౌనం ఎందుకు?

ఇరాన్ నాయకత్వమే టార్గెట్‌గా అమెరికా, ఇజ్రాయిల్‌లు జరిపిన యుద్ధోన్మాదాన్ని భారత్ వ్యతిరేకించలేదు. ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ హత్యనూ స్పష్టంగా ఖండించలేదు. దీంతో కేంద్రంలోని మోడీ సర్కారు తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమయ్యాయి. ప్రతిపక్షాలు డిమాండ్ చేసినప్పటికీ కేంద్రం నుంచి ఎలాంటి స్పందనా లేకపోవడం గమనార్హం. మోడీ ప్రభుత్వ తీరు భారత విదేశాంగ విధానం స్వతంత్రత తగ్గిందనే అభిప్రాయానికి కారణమైందని విశ్లేషకులు చెప్తున్నారు.

8. రూపాయి పతనం.. ధరల పెరుగుదల.. వీటిపై ప్రణాళిక ఏమిటి?

మధ్యప్రాచ్యంలో యుద్ధం కొనసాగితే భారత రూపాయి విలువ పడిపోవచ్చు. ఇంధన ధరలు మరింతగా పెరగొచ్చు. చిన్న, మధ్య తరహా పరిశ్రమలు నష్టపోతాయి. ఉద్యోగాలకు కోత పడే ప్రమాదం ఉంది. మొత్తంగా ఇది దేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది. అయితే ఈ సమస్యలకు ప్రభుత్వానికి ఒక స్పష్టమైన కార్యాచరణ ఉందా అనే ప్రశ్న తలెత్తుతోంది. ఈ కీలక ప్రశ్నలు, సందేహాలపై మోడీ ప్రభుత్వం వద్ద సరైన సమాధానాలు లేవనే విమర్శలు వినిపిస్తున్నాయి. ముందస్తు వ్యూహం కొరవడటం, అమెరికాపై అధికంగా ఆధారపడటం, దేశంలో ప్రజాస్వామ్య పారదర్శకత లేకపోవడం వంటి పరిస్థితులు భారత్‌కు కష్టాలను తెచ్చిపెడుతున్నాయని విశ్లేషకులు చెప్తున్నారు. ఈ పరిస్థితి భారత విదేశాంగ విధానంలో పెద్ద లోపాన్ని చూపుతోందని వారు హెచ్చరిస్తున్నారు.

# మాజీలు, 'అర్బన్'లపై కక్ష అవసరమా?

**మన దునియా,హైదరాబాద్: మార్చి 17**

ఆయుధాలను అప్పగించి లొంగిపోతున్న మావోయిస్టులను చేరదీస్తున్న ప్రభుత్వాలకు మాజీలు శత్రువులుగా కనిపించడం వింతగా ఉన్నది. తమ తోటివారి సంతాపసభలో పాల్గొన్నందుకు ప్రభుత్వం వారిని దేశద్రోహుల కింద జమ కడుతున్నది. గత అక్టోబర్‌లో ఆపరేషన్ కగార్ కాల్పుల్లో మరణించిన ఓ మావోయిస్టు అంత్యక్రియల్లో, సంతాప సభలో పాల్గొన్న 230 మందికి జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) ఇటీవల నోటీసులు జారీ చేసినట్లు పత్రికల్లో వచ్చింది. అందరినీ మాజీ మావోయిస్టులుగా ముద్ర వేయడం మరింత విచిత్రంగా ఉన్నది.ఒకవైపు రోజుకు కొందరు అన్నట్లు మావోయిస్టులు జనజీవన స్రవంతిలోకి వస్తుంటే..మాజీలపై ఈ దాడి ఏమిటని జనం విస్తుపోతున్నారు. ఎన్‌కౌంటర్లలో చనిపోయిన నక్సలైట్ల సంతాపసభల్లో 'ఆయన గొప్ప వీరుడు, జీవితాన్ని ప్రజల కోసం త్యాగం చేశాడు. ఆయన ఆశయాలను కొనసాగించాలి' అనే మాటలు సాధారణంగా వినిపించేవే. తెలంగాణ గడ్డపై ఇది సర్వసాధారణమే. ఆ మాటలు అన్నవారుగానీ, విన్నవారుగానీ వెంటనే అడవుల్లోకి వెళ్లి ఉద్యమకారులు అయిపోరు. లోపలివాళ్లే బతుకుజీవుడా అని లొంగిపోతుంటే ఇప్పుడు కొత్తగా అందులో చేరేదెవరు? నక్సల్స్ వైపు యువత ఎక్కువగా మళ్లిన కరీంనగర్ పల్లెల్లో ఇలాంటి విషాద, ఉద్విగ్న సందర్భాలు ఎన్నో! పోలీస్ కాల్పుల్లో నక్సలైట్లు మరణించినప్పుడు వారి ఊర్లలో జరిగే అంతిమ సంస్కారాల్లో ఇవన్నీ పరిపాటే. దీనికి కారణం..అక్కడి ప్రజల్లో ఉద్యమం పట్ల ఉన్న అభిమానం అనుకోవచ్చు లేదా చనిపోయిన మనిషితో ఉన్న అనుబంధం కావచ్చు. ఇదే మొదటి సంతాపసభ కాదు, చివరిది కూడా కాకపోవచ్చు.గత అక్టోబర్‌లో మావోయిస్టు అగ్రనేతల్లో కరీంనగర్ ప్రాంతానికి చెందిన ఒకరు ఛత్తీస్‌గఢ్‌లో భద్రతా బలగాలు జరిపిన కాల్పుల్లో మరణించాడు. ఆయన మృతదేహాన్ని తీసికెళ్లిన కుటుంబ సభ్యులు తమ సొంత గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. తమకు తెలిసిన మనిషి, సుమారు 45 ఏళ్ల తరువాత మృతదేహంగా ఊరికి వచ్చాడని తెలిశాక చుట్టుపక్కల గ్రామాల్లోని వారి బంధువులు, ప్రజలు ఆ అంత్యక్రియలకు భారీగా తరలివచ్చారు. ఇలాంటి సందర్భాల్లో ఎర్ర జెండాలు, నినాదాలు కూడా మామూలే. అయితే దాదాపు ఆరు నెలల కిందట జరిగిన ఆ సంతాపసభలో పాల్గొన్న వారిపై ఎన్ఐఏ ఇప్పుడు నోటీసులు జారీ చేసింది. ప్రభుత్వం పాటిస్తున్న ఈ ద్వంద్వ విధానాలతో కొత్తగా గందరగోళం ఏర్పడే అవకాశం ఉన్నది.కేంద్రం మావోయిస్టుల అణచివేత విధానాలపై తీసుకుంటున్న కొత్త నిర్ణయాలకు, ఎన్ఐఏ దూకుడుకు మధ్య సమన్వయలోపం కనబడుతున్నది. పాతవారు లొంగిపోతుండగా సాధారణ పౌరులకు మాజీలుగా ముద్ర వేస్తే..లొంగుబాట్లపై ప్రభుత్వాలు ఇస్తున్న వెసులుబాట్లకు అర్థమే లేదు. నక్సలైట్లను అణచివేశాక అర్బన్ నక్సలైట్ల భరతం పడతామని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అంటుంటారు. మావోయిస్టుల అధ్యాయమే ముగుస్తున్నప్పుడు అర్బన్ నక్సలైట్ల గొంతు మూగబోయినట్లే. ఆపరేషన్ కగార్ మొదలైనప్పుడు 'కాల్పులు ఆపాలి, శాంతి చర్చలు జరపాలి' అన్నవారు..లొంగుబాట్లను చూసి విస్తుపోయారు. అడవిలోనే వారి అలికిడి ఆగిపోయాక ఇక అర్బన్‌లో ఏముంటుంది? ఆ సిద్ధాంతంపై, దానిని పాటించిన వ్యక్తులపై బీజేపీ నేతలకు సహజంగానే కసి ఉంటుంది. మాజీ అని, అర్బన్ అని ముద్రలేసి సాధారణ జీవితం గడుపుతున్న వారిని ఇబ్బందులకు గురిచేయడం కార్యాచరణ లోపమే అవుతుంది.నక్సలైట్ల అణచివేతలో భాగంగా ప్రభుత్వాలు లొంగుబాట్లను ప్రోత్సహిస్తున్నాయి. అయితే ఆ ఉద్యమానికి యాభై ఏండ్లకు పైగా చరిత్ర ఉన్నందున నక్సలైట్లలో మాజీలు ఉన్నారు. పట్టుబడి, శిక్షలు పడి జైళ్లకు వెళ్లివారు ఉన్నారు, లొంగిపోయి కేసులను ఎదుర్కొంటూ సాధారణ జీవితం గడుపుతున్నవారు కూడా ఉన్నారు. ఇప్పుడు అగ్రనేతలే లొంగిపోతున్న తరుణంలో వారికన్నా ముందే ఏదోవిధంగా ప్రజల్లోకి వచ్చినవారు నేరస్తులు ఎలా అవుతారనేది అసలు ప్రశ్న. నేరం చేయాలని పార్టీ సభ్యులను ఆదేశించినవారు లొంగిపోతుంటే, వారి ఆదేశాల మేరకు నేరం చేసి జైళ్లలో ఉన్నవారి పరిస్థితిని ఎలా అర్థం చేసుకోవాలి? నేరానికి ప్రణాళిక రచించడం, పురిగొల్పడం కూడా చట్టపరిధిలో నేరమే. నాయకస్థాయిలో ఉన్నవారు లొంగిపోయి తమ తలపై ఉన్న నగదు బహుమతిని తీసుకొని ఇండ్లకు వెళ్తుంటే దళ సభ్యులు జైళ్లలో మగ్గడం ఒక విరోధాభాసమే. ఒకేవిధమైన నేరం చేసినవారు ఒకరు బయట ఉండడం, మరొకరు లోపల ఉండడం చట్టానికి పరీక్షే.ఇంతవరకు లొంగిపోయిన వారిలో ఎవరినీ పోలీసులు అరెస్టు చేయలేదు. లొంగిపోయినవారి కేసుల విషయంలో చట్టం సానుభూతితో పరిశీలించాలని ఓ లొంగుబాటు సభలో సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఈ నేపథ్యంలో మాజీ మావోయిస్టులు అంటూ ఏకంగా 230 మందికి జారీ చేసిన నోటీసుల విషయంలో ఎన్ఐఏ పునరాలోచన అవసరం. ఎందుకంటే..గత అక్టోబర్ నాటి పరిస్థితులు ఇప్పుడు లేవు. ఉద్యమం తుదిఘట్టంలో ఉన్నందున ఆ ఆవేశాలు చల్లారిపోయాయి. మాజీలు, లొంగిపోయినవారు, అర్బన్ నక్సలైట్లుగా పేరుపడ్డవారు..ఎవరైనా పార్టీ భావజాలాన్ని మోయడానికి సిద్ధంగా లేరు. పార్టీ నిర్ణయం విషయంలో బహిరంగంగా మాట్లాడటం కూడా తగ్గింది. వరుసగా పోలీసు కాల్పుల్లో మావోయిస్టులు మరణిస్తుంటే సానుభూతి కలాల కన్నీళ్ల కవిత్వం కొంతకాలం వచ్చింది. లొంగుబాట్లు పెరిగాక అదీ ఆగిపోయింది. ప్రజా కళలు ఇప్పుడు పాజ్ మోడ్‌లో ఉన్నాయి. ఈ దశలో తాజా మాజీలను వదిలేసి మాజీలపై చర్యలు అర్థరహితమే.



మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం



# ఇంకా రేసులోనే ఇరాన్..!



కౌలాలంపూర్ : ఈ ఏడాది జూన్–జులైలో యూఎస్ఏ, కెనడా, మెక్సికో ఆతిథ్యమివ్వనున్న ఫిఫా ఫుట్‌బాల్ ప్రపంచకప్‌లో ఇరాన్ ప్రాతినిధ్యంపై అనిశ్చితి కొనసాగుతున్నది. అమెరికా.. ఇజ్రాయెల్‌తో కలిసి తమ దేశంపై చేస్తున్న దాడికి నిరసనగా యూఎస్‌లో జరుగబోయే ప్రపంచకప్‌లో తమ జట్టు పాల్గొనబోదని ఆ దేశ క్రీడాశాఖ మంత్రి అహ్మద్ దోన్యమలి తెలిపిన విషయం తెలిసిందే. అయితే తాజాగా ఆసియా ఫుట్‌బాల్ సమాఖ్య మాత్రం ఇరాన్ నుంచి అధికారికంగా తమకు అలాంటి ప్రతిపాదనేమీ రాలేదని, ఆ జట్టు వరల్డ్ కప్ ఆడుతుందని ధీమా వ్యక్తం చేసింది. ఈ మేరకు కౌలాలంపూర్‌లో జరిగిన ఓ సమావేశంలో ఏఎఫ్‌సీ ప్రధాన కార్యదర్శి విండ్సర్ జాన్ స్పందిస్తూ.. 'వారు (ఇరాన్) మా సభ్యులు. ఆ దేశం ప్రపంచకప్ ఆడాలని మేం కోరుకుంటున్నాం. ఇది చాలా భావోద్వేగ సందర్భం. చాలామంది చాలా విషయాలు చెబుతున్నారు. దీనిపై తుది నిర్ణయం తీసుకోవాల్సిందైతే ఇరాన్ ఫుట్‌బాల్ సమాఖ్యే' అని చెప్పాడు.

# ముంబై మహిళల టీ20 లీగ్‌కు వేళాయె



ముంబై : ముంబై క్రికెట్ అసోసియేషన్(ఎమ్‌సీఏ) మరో వినూత్న ఆలోచనతో ముందుకొచ్చింది. ఇప్పటికే పురుషుల టీ20 లీగ్ ద్వారా దేశ వ్యాప్తంగా దృష్టిని ఆకర్షించిన ఎమ్‌సీఏ తాజాగా తొలిసారి మహిళల లీగ్‌కు సిద్ధమైంది. దేశంలో మహిళల క్రికెట్‌కు పెరుగుతున్న ఆదరణను దృష్టిలో పెట్టుకుంటూ ఎమ్‌సీఏ అరంగేట్రం టీ20 లీగ్ ద్వారా ప్రతిభ కల్గిన ప్లేయర్లను వెలుగులోకి తీసుకొచ్చేందుకు సమాయత్తమైంది. ఇందులో భాగంగా సోమవారం రెండు టోర్నీలకు సంబంధించిన ట్రోఫీలను టీమ్ఇండియా స్టార్ క్రికెటర్ రోహిత్‌శర్మ ఆవిష్కరించాడు. ఈ కార్యక్రమంలో ముంబై క్రికెటర్ సయాలీ సత్గరెతో పాటు ఎమ్‌సీఏ అధ్యక్షుడు అజింక్యా నాయక్, అశిష్ షెలార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రోహిత్ మాట్లాడుతూ 'క్రికెట్ అభివృద్ధి కోసం ఎమ్‌సీఏ చేస్తున్న కార్యక్రమాలపై సంతోషంగా ఉన్నాను. కేవలం ఐపీఎల్ ద్వారానే కాకుండా టీ20 ముంబై లీగ్ ద్వారా మరింత మంది యువ ప్లేయర్లకు అవకాశం కల్పిస్తున్నది. ముంబై టీ20 లీగ్‌లో ఆడిన ప్లేయర్లలో చాలా మంది ఐపీఎల్‌తో పాటు జాతీయ జట్టులో ప్రాతినిధ్యం వహిస్తున్నారు' అని అన్నాడు.

# సిన్నర్, సబలెంకాకు టైటిళ్లు.. ఫైనల్‌లో మెద్వెదెవ్, రిబాకినాకు నిరాశ



ఇండియన్ వెల్స్ : ఏటీపీ మాస్టర్స్ 1000 టోర్నీ అయిన ఇండియన్ వెల్స్ సింగిల్స్ టైటిల్స్‌ను యానిక్ సిన్నర్ (ఇటలీ), అరీనా సబలెంకా (బెలారస్) సొంతం చేసుకున్నారు. ఆదివారం జరిగిన మెన్స్ సింగిల్స్ ఫైనల్‌లో రెండో సీడ్ సిన్నర్.. 7-6 (8/6), 7-6 (7/4)తో డానిల్ మెద్వెదెవ్ (రష్యా)ను ఓడించి తన కెరీర్‌లో తొలి ఇండియన్ వెల్స్ టైటిల్‌ను దక్కించుకున్నాడు. తద్వారా అతడు ఆరు ఏటీపీ మాస్టర్స్ 1000 హార్డ్ కోర్ట్ టైటిల్స్‌ను గెలిచినవారిలో జొకోవిచ్, ఫెదరర్ తర్వాతి స్థానంలో నిలిచాడు. మహిళల సింగిల్స్‌లో మూడు సీజన్లలోనూ ఫైనల్ చేరినా టైటిల్ దక్కని టాప్ సీడ్ సబలెంకా.. ఆదివారం నాటి పోరులో మాత్రం ఆ గండాన్ని అధిగమించింది. ఫైనల్‌లో ఆమె.. 3-6, 6-3, 7-6 (8/6) ఎలీనా రిబాకినా (కజకిస్థాన్)ను చిత్తుచేసి ఇటీవలే ముగిసిన ఆస్ట్రేలియా ఓపెన్ ఫైనల్‌లో తనకు ఎదురైన పరాభవానికి బదులు తీర్చుకోవడంతో పాటు తొలి ఇండియన్ వెల్స్ టైటిల్‌నూ నెగ్గింది.

# ఆస్పత్రిపై దాడి యుద్ధ నేరమే: రషీద్ ఖాన్




బాగ్దాద్: ఆఫ్ఘనిస్తాన్‌లో ఓ డ్రగ్స్ చికిత్సాలయంపై సోమవారం రాత్రి పాకిస్థాన్ ఆకస్మిక దాడి చేసింది. ఆ దాడి వల్ల కాబూల్‌లోని ఆస్పత్రిలో 400 మంది మృతిచెందగా, మరో 250 మంది గాయపడ్డారు. డ్రగ్ రిహాబిలిటేషన్ ఆస్పత్రిపై రాత్రి 9 గంటలకు దాడి జరిగినట్లు ఆఫ్ఘన్ ప్రభుత్వ ప్రతినిధి హమ్‌దుల్లా ఫిత్రత్ తెలిపారు. అయితే ఈ ఘటన పట్ల ఆఫ్ఘన్ క్రికెటర్ రహీద్ ఖాన్ స్పందించారు. పాక్ మిలిటరీ చర్యను ఆయన ఖండించారు. పాకిస్థాన్ వైమానిక దాడుల వల్లే ప్రాణనష్టం జరిగినట్లు ఆ క్రికెటర్ చెప్పారు. పవిత్రమైన రంజాన్ మాసం సమయంలో ఈ దాడి జరగడం దారుణమన్నారు. తన ఎక్స్ అకౌంట్‌లో రషీద్ ఖాన్ రియాక్ట్ అయ్యారు.సాధారణ పౌరులు చనిపోవడం బాధగా ఉన్నట్లు చెప్పారు. ఇండ్లను, విద్యా సంస్థలను, వైద్య కేంద్రాలను కావాలని లేదా అనుకోకుండా అటాక్ చేసినా అది యుద్ధ నేరమే అవుతుందని రషీద్ పేర్కొన్నారు. రంజాన్ పవిత్ర మాసం వేళ మనుషుల ప్రాణాలు విలువ ఇవ్వకుండా వ్యవహరిస్తున్న తీరు తీవ్రంగా కలచివేస్తున్నట్లు చెప్పారు. దీని వల్ల వైరం, ద్వేషం పెరుగుతుందన్నారు. ఐక్యరాజ్యసమితి, ఇతర మానవ హక్కుల సంఘాలు ఈ ఘటన పట్ల దర్యాప్తు చేపట్టాలని కోరారు. నిందితులను శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి కష్ట సమయంలో ఆఫ్ఘన్ ప్రజలకు అండగా ఉండనున్నట్లు చెప్పారు.

# మాల్దీవ్స్ టు నెట్స్.. ఐపీఎల్ కోసం రంగంలోకి ముంబై దిగ్గజం..!





పంతొమ్మిదో సీజన్ ఐపీఎల్ కోసం రోహిత్ శర్మ సిద్ధమవుతున్నాడు. రెండు రోజుల క్రితం కుటుంబంతో కలిసి మాల్దీవ్స్(మీఖ్రీ౹ఎఅజవం)లో వెకేషన్‌లో సరదాగా గడిపిన రోహిత్.. స్వదేశం వస్తూనే నేరుగా ముంబై స్క్వాడ్‌తో కలిశాడు. మంగళవారం సహచరులు, కోచ్ మహేల జయవర్ధనేతో కాసేపు ముచ్చటించిన హిట్‌మ్యాన్.. కిట్ బ్యాగ్‌తో మైదానంలోకి దిగాడు. నెట్స్‌లో బ్యాటింగ్, ఫీల్డింగ్.. ప్రాక్టీస్ చేసిన రోహిత్ ఐపీఎల్‌లో రఫ్ఫాడించాలనే కసితో ఉన్నాడు. ఐపీఎల్ దిగ్గజ కెప్టెన్లలో ఒకడైన రోహిత్ శర్మ మరో సీజన్‌కు రెడీ అవుతున్నాడు. గత సీజన్‌లో దంచేసిన హిట్‌మ్యాన్ (15 మ్యాచుల్లో 418 పరుగులు) ఈసారీ శుభారంభాలు ఇవ్వాలనే కసితో ఉన్నాడు. మంగళవారం ముంబై స్క్వాడ్‌తో కలిసిన రోహిత్ వెంటనే బ్యాటింగ్ ప్రాక్టీస్ మొదలెట్టాడు. శార్దూల్ ఠాకూర్, ఇతర ముంబై బౌలర్లను కాచుకున్న అతడు.. డిఫెన్స్, భారీ షాట్లు సాధన చేశాడు. అనంతరం సహచరులతో కలిసి ఫీల్డింగ్ చేశాడు.మొన్నటి వరకూ టీ20 ప్రపంచకకప్ అంబాసిడర్‌గా మైదానాల్లో సందడి చేసిన రోహిత్.. కాస్త బ్రేక్‌లో మాల్దీవ్స్‌లో కుటుంబంతో కలిసి సేదతీరాడు. ఐపీఎల్‌కు కౌంట్‌డౌన్ తన కెప్టెన్సీలో ముంబైని ఐదుసార్లు (2013, 2015, 2017, 2019, 2020) ముంబైని ఛాపియన్‌గా నిలిపిన రోహిత్.. గత రెండేళ్లుగా హార్దిక్ పాండ్యా సారథ్యంలో ఆడుతున్నాడు. పాంటింగ్ వారసుడిగా పంతొమ్మిదో సీజన్‌కు మరో పది రోజులే ఉండడంతో ఈ దిగ్గజ ఆటగాడు ప్రాక్టీస్ మొదలెట్టాడు. ఐపీఎల్ ఆరంభంలో దక్కన్ ఛార్జర్స్ తరఫున విజేతగా నిలిచిన రోహిత్.. ఆపై ముంబై ఇండియన్స్ గూటికి చేరాడు. అక్కడ రికీ పాంటింగ్ వారసుడిగా 2013లో సారథ్యం స్వీకరించిన ముంబైకర్ విజయవంతమైన నాయకుడిగా చరిత్రకెక్కాడు.

మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం



## సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు.. రేణు దేశాయ్ కేసులో ఇద్దరి అరెస్ట్!

సోషల్ మీడియా వేదికగా మహిళలను, సెలబ్రిటీలను లక్ష్యంగా చేసుకుని అసభ్యకర వ్యాఖ్యలు చేస్తున్న వారిపై సైబరాబాద్ పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. ముఖ్యంగా నటి రేణు దేశాయ్ ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు రంగంలోకి దిగిన పోలీసులు... నిందితులను కటకటాల వెనక్కి నెట్టారు.గత కొంతకాలంగా తనపై వస్తున్న అశ్లీల కామెంట్లు, వ్యక్తిగత దూషణలపై రేణు దేశాయ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఇటీవల సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించారు. తన ప్రతిష్ఠకు భంగం కలిగిస్తూ, అసభ్య పదజాలంతో వేధిస్తున్న నాలుగు సోషల్ మీడియా అకౌంట్లపై ఆమె ఫిర్యాదు చేశారు. దీనిని సీరియస్‌గా తీసుకున్న పోలీసులు, సాంకేతిక ఆధారాల సాయంతో నిందితులను గుర్తించి ఇద్దరిని అరెస్ట్ చేశారు. మిగిలిన ఇద్దరి కోసం గాలింపును మరింత వేగవంతం చేశారు. కేవలం రేణు దేశాయ్ మాత్రమే కాకుండా, నటి అనసూయను వేధించిన కేసులోనూ ఒకరిని పోలీసులు ఇప్పటికే అదుపులోకి తీసుకున్నారు. "చీకట్లో ఉండి ఫేక్ అకౌంట్లతో కామెంట్లు చేస్తే ఎవరూ పట్టుకోలేరని అనుకోవద్దు.. మీరు ఎక్కడున్నా సాంకేతిక పరిజ్ఞానంతో పట్టుకుంటాం" అంటూ సైబరాబాద్ పోలీసులు కేటుగాళ్లకు గట్టి హెచ్చరికలు జారీ చేశారు. సెలబ్రిటీలే కాకుండా సామాన్య మహిళలు కూడా ఇటువంటి వేధింపులకు గురైతే... వెనుకాడకుండా ఫిర్యాదు చేయాలని సూచించారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని మహిళలకు పోలీసులు భరోసా ఇచ్చారు.

## విజయ్, త్రిష రూమర్స్‌పై ఖుష్బూ ఫైర్.. వారిది పైశాచిక ఆనందం!

తమిళ స్టార్ హీరో, 'తమిళగ వెట్రి కళగం' పార్టీ అధినేత విజయ్, ప్రముఖ నటి త్రిషల వ్యక్తిగత జీవితంపై గత కొంతకాలంగా సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంపై సీనియర్ నటి ఖుష్బూ సుందర్ తీవ్రంగా స్పందించారు. ఇతరుల వ్యక్తిగత విషయాల్లో తలదూర్చి, అసత్య ప్రచారాలు చేసే వారిపై ఆమె తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రూమర్స్ సృష్టిస్తున్న వారి తీరును ఆమె తప్పుబట్టారు.ఇటీవల ఒక ఇంటర్వ్యూలో మాట్లాడిన ఖుష్బూ... "విజయ్, త్రిష ఇద్దరూ నాకు వ్యక్తిగతంగా బాగా తెలుసు. ముఖ్యంగా త్రిష గురించి చెప్పాలంటే, నేను చూసిన గొప్ప మహిళల్లో ఆమె ఒకరు. ఆమె చాలా మృదుస్వభావి, ఎంతో హుందాగా ప్రవర్తిస్తారు. అలాంటి వ్యక్తిత్వం ఉన్న మహిళపై అనవసరంగా నిరాధారమైన ఆరోపణలు చేయడం చాలా బాధాకరం" అని అన్నారు. ప్రస్తుతం సోషల్ మీడియాలో ఒకరు తుమ్మినా కూడా దాన్ని విమర్శించే దుస్థితి నెలకొందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. రూమర్స్ సృష్టించే వారి మనస్తత్వంపై ఖుష్బూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. "కొందరు ఇతరుల జీవితాల్లో ఏం జరుగుతుందో తెలుసుకోవాలనే ఆసక్తితో వారి గురించి తప్పుగా మాట్లాడుతూ ఒక రకమైన పైశాచిక ఆనందం పొందుతున్నారు. సెలబ్రిటీల ప్రైవసీకి భంగం కలిగించే ఈ సంస్కృతి ఇప్పుడు చెన్నైలో కూడా ఎక్కువ కావడం విచారకరం" అని ఆమె విమర్శించారు. ఇలాంటి కామెంట్లు చేసే వారిలో చాలా మంది అనామకులేనని, వారి మాటలను పట్టించుకుని విలువైన సమయాన్ని వృథా చేసుకోవద్దని త్రిషకు సూచించారు. విజయ్ రాజకీయ రంగ ప్రవేశం నేపథ్యంలో ఈ రూమర్స్ ఆయన కెరీర్‌పై ప్రభావం చూపుతాయా అన్న ప్రశ్నకు కూడా ఖుష్బూ స్పందించారు. "ప్రజలకు ఎవరికి ఓటు వేయాలో బాగా తెలుసు. ఒక నాయకుడి వ్యక్తిగత జీవితాన్ని, రాజకీయాలను ముడిపెట్టడం సరైన పద్ధతి కాదు. ఇది పూర్తిగా వారి వ్యక్తిగత విషయం. దాన్ని భూతద్దంలో పెట్టి చూడాల్సిన అవసరం లేదు" అని స్పష్టం చేశారు. సెలబ్రిటీల గురించి రూమర్స్ రావడం సహజమే అయినా, అవి వారి గౌరవానికి భంగం కలిగించేలా ఉండకూడదని ఆమె హితవు పలికారు.





## బాలీవుడ్ అశ్లీలతపై కఠిన నియంత్రణ ఉండాల్సిందే: కంగనా రనౌత్

బాలీవుడ్ తన స్థాయిని దిగజార్చుకుంటూ, ప్రేక్షకులను ఆకర్షించడం కోసం అన్ని హద్దులను దాటేస్తోందని స్టార్ హీరోయిన్, బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ ఘాటుగా విమర్శించారు. చౌకబారు ట్రిక్కులతో అశ్లీలతను ప్రోత్సహిస్తున్న సినీ పరిశ్రమ తీరును దేశమంతా ఛీకొడుతున్నా, వారికి ఏమాత్రం సిగ్గు ఉన్నట్లు అనిపించడం లేదని ఆమె మండిపడ్డారు. ఇలాంటి అభ్యంతరకర ప్రదర్శనలకు చెక్ పెట్టాలంటే ప్రభుత్వం బాలీవుడ్‌పై కచ్చితంగా కఠినమైన నియంత్రణ విధించాలని, అప్పుడే ఈ అశ్లీలతకు ఎండ్ కార్డ్ పడుతుందని కంగనా గట్టిగా నొక్కి చెప్పారు. అసలు ఈ వివాదం 'కేడీ.. ది డెవిల్' అనే కన్నడ చిత్రం కోసం రూపొందించిన హిందీ పాటతో మొదలైంది. ఈ పాటలోని సాహిత్యం పచ్చిగా, డబుల్ మీనింగ్ డైలాగులతో ఉందంటూ నెటిజన్లు సోషల్ మీడియాలో విరుచుకుపడుతున్నారు. కేవలం సాధారణ ప్రజలే కాకుండా, ప్రముఖ గాయకుడు అర్మాన్ మాలిక్ కూడా కమర్షియల్ సాంగ్ రైటింగ్ ఇంతగా దిగజారిపోవడం బాధాకరమంటూ తన అసహనాన్ని వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తడంతో నోరా ఫతేహి నటించిన ఈ పాటను ఇప్పటికే యూట్యూబ్ నుంచి తొలగించారు. అంతేకాకుండా, నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ కూడా ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకుని చిత్ర బృందానికి నోటీసులు జారీ చేయడం గమనార్హం.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AAKULA SUDHAKAR, PUSHPALATHA PUBLICATIONS AND PRINTING, HNo: 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLA-BELLY MANDALAM, WARANGAL DIST - 506349, TELANGANA STATE, PUBLISHED PUSHPALATHA PUBLICATIONS HNo. 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLABELLY MANDALAM, WARANGAL DIST- 506349.TELANGANA STATE,TITEL-code : RNI NUMBER ; TELTEL-2023/85680, Cel1 No: 9603969335, MANADUNIA 2022 @ gmail.com